ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
27 ఫిబ్రవరి, 2011

ENTERED

సైన్స్ దే
అంతిమ విజయం

హ్యాపీ బర్త్‌డే

(2011 ఫిబ్రవరి 27 నుంచి 2011 మార్చి 5 వరకు)

కె. విధుల
ఫిబ్రవరి
కోకిల-విద్యాసాగర్‌రెడ్డి
నకిరేకల్-నల్లగొండ

శ్రీహర్షిత
మార్చి-1
సరస్వతి-లక్ష్మణరావు
రాజేంద్రనగర్-కాకినాడ

ఎన్. లహరి
3సం॥, ఫిబ్రవరి-2008
కృష్ణవేణి-సింహ
ఎల్.బి.నగర్-సికింద్రాబాద్

టి. మురళీధర్
5సం॥, ఫిబ్రవరి-28
జ్యోతి-వెంకటరమణ
శాంతినగర్-డోర్నకల్

ఆర్. హితేష్
1సం॥, ఫిబ్రవరి-2010
మణి-శ్రీను
అనంతపురం

జి. తరుణ్
6సం॥, మార్చి-1
ప్రతిమ-శ్రీనివాస్
మలక్‌పేట-హైదరాబాద్

బి. వైభవ్
3సం॥, ఫిబ్రవరి-27
మణిశ్రీ-బాలకిషన్
సింగాపూర్-రంగారెడ్డి

సంబయ్(బన్ని)
ఫిబ్రవరి
లక్ష్మి-శ్రీను
శ్రీకాకుళం

ఎం. ధరణి
1సం॥, ఫిబ్రవరి-2010
లక్ష్మీకుమారి-శ్రీనివాసరెడ్డి
మాదల-గుంటూరు

ఆహ్వానం

మీ చిన్నారులకు కూడా ఇలా పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పాలని ఆశ పడుతున్నారా! అయితే ఆలస్యం ఎందుకండి! వెంటనే పోస్ట్ కార్డు తీసుకోండి. దాని మీద మీ బాబు- పాప పేరు , పుట్టిన తేదీ, నెల, సంవత్సరం, ఊరు , తల్లిదండ్రుల వివరాలు రాసి పోస్ట్ చేయండి. అన్నట్టు కలర్ ఫొటో జతచేయడం మరువకండి. అయితే మీ చిన్నారి వివరాలను 15 రోజుల ముందుగానే మాకు అందేవిధంగా పంపగలరు.

మా చిరునామా
హ్యాపీ బర్త్‌డే, ప్రజాశక్తి, ప్లాట్ నెం. 21/1,
ఎం.హెచ్ భవన్
ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి,
హైదరాబాద్-500 020
email-
venkateshcartoon@gmail.com

అక్షయ-అభినయ
ఫిబ్రవరి
జానకి-చిదంబరం
రామంతపూర్-హైదరాబాద్

మనలో మాట

సాగితే జల్సాలకు జైలే పదిలం

సాగితే రోగమంత సుఖం లేదన్నారు పెద్దలు. మనం దాన్ని - సాగించుకొనే బాబుల జల్సాలకు జైలే పదిలం అని మార్చుకోవచ్చేమో.

ఎంత పెద్ద నేరం చేస్తే అంత గొప్ప రాచమర్యాదలు. నెంబర్ వన్ నేరస్థులకు, అంతర్జాతీయ దొంగల ముఠా నాయకులకు కారాగారాలు చక్కని అతిథి గృహాలు. పేరుమోసిన ఖైదీలకు అక్కడ సర్వ సౌఖ్యాలు అందుబాటులో వుంటాయి. కాదంటే కాసింత ఖర్చవుతుందంతే. చికెన్-మటన్ బిర్యానీలు, పళ్ల రసాలు, ఖరీదైన సిగరెట్లు, టీవీలు, సినిమాలు... కనుసైగతో సమకూరుతాయి. కారాగృహాల్లో ఏవైతే నిషేధితాలో అవన్నీ వీరికి అందుబాటులో వుంటాయి. కావాలంటే దర్జాగా ఇంటి భోజనం తెప్పించుకోవచ్చు. కోరిన తిండి తిని విశ్రాంతి తీసుకోవచ్చు. దందాలకు సెల్‌ఫోన్లెటూ చేతిలోనే వుంటాయి. ఊచల వెనక ఉన్నామన్న బెంగే అక్కర్లేదు.

ఖరీదైన మనుషులు జైల్లో పడితే... వారికి అప్పటికప్పడే కొత్త రోగాలు పుట్టెడు పుట్టుకొస్తాయి. పోలీసుల పహారాతో ఆసుపత్రికెళతారు. ఐసీయూలో విశ్రాంతి తీసుకుంటారు. తప్పనిసరై జైల్లో వుంటే విడిచిన బట్టలు ఉతికేందుకు, ఒళ్లు పట్టేందుకు తోటి ఖైదీలు సిద్ధంగా వుంటారు. ఆటలపై మనసు పడితే వాటికీ ఢోకా లేదు.

మంత్రులూ, ముఖ్యమంత్రులు, మాజీలు జైళ్లకు వెళ్తే చెప్పనే అక్కర్లేదు. నిన్నటి వరకు 'రాజా'లా వెలిగిపోయిన మాజీ కేంద్ర మంత్రివర్యులిప్పడు చెరసాలలోనే విశ్రాంతి తీసుకుంటున్నారు. వీరు కూడా గ్యాస్ట్రిక్ సమస్య వంక చెప్పేసి భేషుగ్గా ఇంటి భోజనం తెప్పించుకుంటున్నారు. జైలు అధికారులు పైకి మాత్రం రాజావారు కోరినా హోమ్‌ఫుడ్ అంగీకరించలేదని పత్రికా ప్రకటనలిచ్చేశారు. చట్టబద్ధంగా తప్ప చేయడంలో, చేయించడంలో రాజావారిది అందెవేసిన 'చెయ్యి' కదా. వాటితో పోల్చుకుంటే ఇదెంత!

దేవతా పులుసుతో ప్రాణాలు నిల్పుకొన్న స్వాతంత్ర్య సమరయోధులు, పోరాటయోధులు, సొంత లాభం ఆసాంతం మానుకొని పదిమంది మంచి కోసం పనిచేసే నిజమైన ప్రజాసేవకుల జైలు జీవితం ఎక్కడ? కాసులు వెదజల్లి కోరినది సాధించుకునే నెంబర్ వన్ మోసగాళ్ల కారాగార జీవితం ఎక్కడ?

★

ఈ సంచికలో....

టపా	...	2
తెల్సా	...	3
పరుగుల కల	...	4
కవిత్వమ్	...	6
రుచి	...	7
నవ్వుల్ పువ్వుల్	...	10
కొత్త పుస్తకాలు	...	11
చూద్దామా	...	12
అట్టమీది కథ	...	14
వికాసం	...	20
ఈ పేజ్	...	21
బాలనేస్తాలు	...	22
మాటలకోట	...	24

ఇంకా...



ఆఖరి పలుకులు 5

సినిమా ... 8

"ప్రేరణ పొందని దర్శకులు ఎవరూ వుండరు"

కథ ... 18

చిగురు



చేదు నిజం

అట్టమీది కథగా వచ్చిన 'అరబ్బుల ప్రజాస్వామ్య దాహం' వ్యాసం చక్కని అవగాహన కలిగించింది. 'వికాసం' విభిన్నంగా ఉంది. 'బాలనేస్తాలు' పేజీలో చిన్న కథను జత చేయడం బాగుంది. 'ప్రేమమయం' చిత్రావళి ప్రేమైకంగా వుంది. 'కెరటం'తో పాటు 'తెల్సా' వంటి శీర్షికలు కొత్త తరహా సంగతులతో మమ్మల్ని ఆకట్టుకుంటున్నాయి. 'ఈ పేజీ'లోని ఇ-మెయిల్స్ విషయాలు ఉపయోగపడుతున్నాయి. సమీక్ష ద్వారా 'స్త్రీ ఎందుకు బానిసైంది, నేరము-శిక్ష' వంటి పుస్తకాలు, వాటి విశిష్టత తెలిసింది. ఉదయగిరి ఊసుల ద్వారా ఆనాటి కోటను కళ్లకు కట్టినట్లు అందించిన ఈతకోట సుబ్బారావు గారికి అభినందనలు. అందె నరసింహారావు కవిత గమ్మత్తుగా సాగి ఆహ్లాదం, ఆలోచనలతో ఉక్కిరిబిక్కిరి చేసింది. ప్రేమ కూడా వ్యాపారమైపోయిందన్న 'మాట' చేదు నిజం అనిపించింది.

నేమాన సుభాష్ చంద్రబోస్, ఇలిసిపురం.

రుజువు చేసిన కవర్

ఈ ఆదివారం అట్టమీది కథ ఎంతో విశ్లేషణాత్మకంగా ఉంది. ఈజిప్టులో ప్రజలు పాలక వర్గంపై తిరుగుబాటు జరిపిన విధానం చూస్తుంటే అక్కడి ప్రజలు ముబారక్ క్రూర నియంతృత్వ పాలన వల్ల ఎంత కష్టపడ్డారో తెలుస్తుంది. ప్రజల ఆగ్రహం ముందు ఏ నియంతా నిలబడలేడన్న నిజాన్ని ఈజిప్టు ఘటన రుజువు చేసింది. ఈజిప్టు ప్రజలకు అభినందనలు.

ఎన్. భీమార్జున్ రెడ్డి, నల్గొండ.

అలరించిన ఊసులు

ఉదయగిరి ఊసులు ఎంతగానో అలరించాయి. అక్బర్ చక్రవర్తి అనేక హిందూ దేవాలయాలు, ముస్లిం మసీదుల నిర్మాణం చేపట్టి అక్బర్ ది గ్రేట్ అనిపించుకున్నాడు. తాను సర్వమతసారంతో 'దిన్-ఇ-ఇల్లాహి' అన్న కొత్త మతాన్ని సృష్టించినా, అందులో చేరమని ఎవరినీ నిర్బంధించలేదు. విజయ నగర రాజులు ఉదయగిరికి ఎంతో వైభవం, గుర్తింపు తెచ్చారు. ఈ వ్యాసం చదవడం వల్ల ఆనాటి ఎన్నో విషయాలు తెలిశాయి.

నూతి నారాయణ, గడ్డిఅన్నారం.



అభినందనీయులు

ప్రపంచంలోనే నేడు అరబ్బు దేశాల ప్రజా ఉద్యమాలు కొత్తదనంతో ఎగిసిపడుతున్నాయి. ఒకదాని వెంట మరో దేశం ఈ ప్రజా ఉద్యమాల జాబితాలో చేరాలి. అమెరికా ఇజ్రాయిల్ కూటమికి వ్యతిరేకంగా పనిచేస్తున్న ముస్లిం బ్రదర్ హుడ్ సంస్థకు ఈజిప్టు పౌర సమాజంలో ప్రముఖ స్థానం ఉంది. నియంతను ఎదుర్కొన్న ఈజిప్టు ప్రజల పోరాటం అభినందించదగినది.

టి. శ్రీరామ్మూర్తి, గాజువాక.

ప్రచారం లేకపోవడం వల్లే...

ఈ నెల ఆరవ తేదీ సంచికలో ఏఎన్నార్ అభిమానులను ఆకట్టుకునేలా 'అట్టమీది కథ' అందించడం బాగుంది. 'బాల నేస్తాలు'లో చిన్న కథను ప్రవేశపెట్టడం బాగుంది. టర్కీ చిట్టెమ్మ ప్రేమ కోరిక నెరవేరాలని ఆశిస్తున్నాం. అడిగోపుల వెంకటరత్నం 'కవిత'లో అవినీతిని ఎండగట్టారు. ప్రచారం లేకనే విక్టోరియా మ్యూజియం గురించి చాలా మందికి తెలీదు. హంగులు, ఆర్భాటాలతో అనవసరంగా ఖర్చుపెట్టే ప్రబుద్ధులు మారాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ పేజీ ద్వారా కంప్యూటర్ గురించి చాలా విషయాలు తెలియజేస్తున్నారు. 'మనలో మాట'లో చెప్పినట్లుగా నీతులు ఎదుటివాడికే కాదన్నది నగ్నసత్యం.

ఎన్.ఎస్, శ్రీకాకుళం.

సినిమా వ్యాసం బాగుంది

హిమాంశురాయ్ గురించి వచ్చిన సినిమా వ్యాసం బాగుంది. నియంత అధికార దాహం ఎంతో కాలం సాగదు. అరబ్బుల ప్రజాస్వామ్య దాహం ముందు ఎంతటి నియంతైనా ఓడిపోక తప్పదని రుజువు చేశారు అక్కడి ప్రజలు. మాటల కోట మండపం బాగుంది.

వాస్తు రామచంద్ర, రాంజీనగర్.

ఆకట్టుకుంటున్న బాల కథ

జాతీయ, అంతర్జాతీయ సమకాలీన సమస్యలపై 'అత్తను అమ్ముకొమ్మని, కోడల్ని కొలుచుకొమ్మన్న' ధోరణిలో స్వార్థంతో ద్వంద్వ నీతులను వల్లిస్తూ, సంపద, కీర్తి వ్యామోహంతో ఏకఛత్రాధిపత్యానికి వెంపర్లాడే అమెరికా మిథ్యా పెద్దమనిషి వైఖరిని 'మనలోమాట' ద్వారా చక్కగా నిరసించారు. ఆక్సిజన్ కలుషితమయ్యాక కార్బన్ డయాక్సైడ్‌ని ఎందుకు నిందించడం అని సూటిగా, ఘాటుగా ప్రశ్నించిన అడిగోపుల వెంకటరత్నమ్ 'కవిత' నిజమైన చైతన్య స్ఫూర్తిని కలిగించింది. సంప్రదాయాన్ని పాటించాలనుకుంటే పర్వాలేదు కానీ ఆర్భాటంగా చేసే పెళ్లిళ్ల ప్రచారం కోసమే ఇలా చేస్తున్నారా అనిపిస్తుంది. ఇటువంటి వారిని చూసి మిగతా వారు కూడా ఇలా చేయక తప్పదేమో అని శక్తికి మించిన భారం వేసుకుంటున్నారు. 'బాల నేస్తాలు' పేజీలో చిన్న కథను పిల్లలు ఇష్టంగా చదువుతున్నారు.

భైరి సత్యనారాయణ, కొత్తగూడెం.

★



2.5 మీటర్ల కురులు

జుట్టున్నమ్మ ఏ కొప్పు పెట్టినా అందమే అన్న సామెత ఇలాంటి వారిని చూశాకే వచ్చి వుంటుంది. 'అమ్మో ఇంత పొడవు కురులా! చక్కగా తల స్నానం చేసి జడ వేసుకొని ఇన్ని కనకాంబరాలు పెట్టుకుంటే వుంటుందీ! అదిరిపోతుంది...' అనుకుంటున్నారా! ఇలా చూసి ఆనందించడానికి బానే వుంటుంది. అయితే అంత పొడవు జుట్టు వుంటే గానీ సమస్యలేంటో తెలియవంటోంది చెంగ్ షికన్. మధ్యలో ఈవిడెవరు? అనుకోకండి. ఫొటోలో కనిపిస్తున్న కేశ సుందరే చెంగ్. పేరు వింటేనే తెలుస్తోందికదా ఈమెది చైనా అని. ఆమె ఒక బ్యూటీ పార్లర్ యజమానురాలు. మరో విషయం ఏమంటే ఆమె వయసు యాభై రెండేళ్ల. ఇంతకీ ఆమె కేశాల పొడవు ఎంతనుకుంటున్నారు? ఆ...ఎంతా! సింపుల్‌గా 2.5 మీటర్లే. తల స్నానం చేయాలంటే రెండు గంటలు, చిక్కు తీయడానికి అర్ధగంట పడుతుందట. మరి ఇంత సమయం వెచ్చించి కురులను కాపాడుకోవాలంటే చాలా ఓర్పు వుండాలికదూ.



తెలుసా!

ఎంత పెద్ద దీపమో!

మనం ఎన్నో రకాల దీపాలను చూసి వుంటాం. కానీ ఇదిగో ఈ బొమ్మలో కనిపించే లాంటి పొడవాటి దీపాన్ని చూశారా! అయితే స్వీడన్ వెళ్లాల్సిందే. ఎందుకంటే ఇది దర్శనమిచ్చేది అక్కడే కనుక. ఇది 5.8 మీటర్ల పొడవుంటుంది. దీన్ని 2006వ సంవత్సరంలో స్వీడిష్ నగరమైన మాల్మోలో ఏర్పాటు చేశారు. రాత్రుళ్లు అటుగా వచ్చేవారికి కూసింత కాలక్షేపాన్ని, ప్రశాంతతను అందిస్తోందీ దీపం. ఆరోజుటి పని ఒత్తిడి నుంచి బయటికి రావడానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతోంది. స్థానికులే కాదండోయ్! ఇరుగుపొరుగు రాష్ట్రాల నుంచి వచ్చే సందర్శకుల సంఖ్య కూడా ఎక్కువే. ఎంచక్కా ఆ పరిసరాల్లో వున్న బల్లల మీద కూర్చుని సేదతీరుతుంటారు. అన్నట్టు ఇది ఎప్పుడూ ఒక చోటే వుండదు. ఆ నగరమంతా పర్యటిస్తుంది. అయితే క్రిస్టమస్ సందర్భంగా మాత్రం డిసెంబర్ 15వ తేదీనాటికి మళ్లీ మాల్మోలో వచ్చేస్తుంది.

వేళ్లతోనే రికార్డు రాసేస్తే...

ఎవరైనా దేన్నైనా వేళ్లతోనే రాస్తారు! అందులో వింతేముంది అనుకోవచ్చు. అత్యధిక వేళ్లు కలిగినందుకు రికార్డు రాయనుంది లీ యదీ మిన్ అనే ఏడాది పాప. ఈమె తన తల్లి, సోదరితో కలిసి మయన్మార్‌లోని యాంగాన్‌లో నివసిస్తుంది. ఇంతకీ తనకు ఎన్ని వేళ్లు వున్నాయనుకుంటున్నారు! రెండు చేతులకు కలిపి 12, రెండు కాళ్లకు 14. అంటే ఒక్కో చేతికి ఆరేసి, ఒక్కో కాలికి ఏడేసి చొప్పున వేళ న్నాయన్నమాట. మామూలుగా ఎవరికైనా ఐదేసి చొప్పున వేళు ంటాయి. మరి ఈ పాపకు ఆరు వేళ్లు ఎక్కువున్నాయి. అందుకే గిన్నిస్ బుక్‌లోకి ఎక్కాలని చూస్తోంది. సర్సరి దీనికే ఇంత ఆశ్చర్యపోతున్నారా! మయన్మార్‌లో మరో వింత మనిషి వున్నాడు. అతను కూడా గిన్నిస్ బుక్ అధికారులకు తన ప్రత్యేకతను గుర్తించమని విజ్ఞప్తి చేశాడు. అత్యధికంగా రక్తదానం చేసిన మనిషిగా తనను గుర్తించమని అడుగుతున్నాడా వ్యక్తి. తన పేరేంటనుకుంటున్నారు! మాంగ్ మాంగ్ గై. వయసు 68 ఏళ్లు. 1956 ఫిబ్రవరి నుంచి 2010 ఆగస్టు వరకు 204 సార్లు రక్తదానం చేశాడు. అందుకుగాను తన పేరును గిన్నిస్ బుక్‌లోకి ఎక్కించమని అడుగుతున్నాడు.



పరుగుల కల

పాప నోటెంట వచ్చిన ఆ మూడు మాటలు మూడు బాంబుల్లా పేలాయి. ఎన్నో సంవత్సరాలుగా వేలాది ఆపరేషన్లు చేసిన డాక్టర్లకే చాలాసేపు నోటెంట మాట రాలేదు.

"అంత కఠినమైన నిర్ణయం తీసుకోవాలంటే చాలా గుండె ధైర్యం కావాలి. ఈ పసివయస్సులోనే అదెలా సాధ్యమైంది? శరీరంలోంచి ఒక భాగాన్ని శాశ్వతంగా తీసేయమని తనకు తానుగా చెప్పడమంటే చిన్నవిషయమా! చూస్తూ చూస్తూ కాలిని తీసేయడమంటే కష్టమే. అదీ ఏ దుర్ఘటనలోనో పాడైపోయిన శరీరభాగాన్ని తీసేయడంలో అర్థం వుంది. కానీ...ఇలా పుట్టుకతో వచ్చిన లోపాన్ని నిండా నింపుకున్న కాలిని తీసేయడమంటే... వారికి ప్రాణం ఒప్పలేదు. పాప మాత్రం కచ్చితంగా చెప్తోందే! ఇంక పిల్ల తల్లిదండ్రులు కూడా అంగీకరిస్తేనే ఏదైనా నిర్ణయించుకోగలం..." అనిపించింది వైద్యులకు.

కూతురు చెప్పిన మాటలను తల్లిదండ్రులు కూడా విన్నారు. అచేతనంగా నిలబడడం తప్ప వెంటనే సమాధానం చెప్పలేకపోయారు. 'నిజంగానే ఈ మాటలు అంటున్నావా?' అన్నట్టు వారి కళ్ల మాత్రం పాపను ప్రశ్నిస్తున్నాయ్.

'అమ్మా...నాన్నా... నేను చెబుతోంది నిజమే. నేను పలికిన ప్రతి అక్షరం నా గుండె లోతుల్లోంచి వచ్చిందే' అన్నట్టు కళ్లతోనే సమాధానం చెప్తోంది కుమార్తె.

◆◆◆

డేనియల్ బ్రాడ్‌షా పాఠశాలలో చదువుకుంటోంది. కానీ అందరు పిల్లల్లా బ్యాగు భుజాన తగిలించుకుని కేరింతలు కొడతూ, పరుగెత్తుకుంటూ స్కూలు ఆవరణలోకి అడుగెట్టలేదు! నాలుగు చక్రాల బండిలో వెళ్లాలి. పుట్టుకతోనే వచ్చిన జబ్బు వల్ల ఆమెకు కుడికాలి సమస్య వుంది. మోకాలు బలహీనంగా పీలగా లోపలికి వంగిపోయి వుంటుంది. పైగా రెండు తొంటి ఎముకల దగ్గర కూడా సమస్య వుండడంతో ఆమె సొంతగా నడవలేదు. ఇదీ డేనియల్ అవిటితనం వెనక వున్న కథ.

◆◆◆

స్కూల్లో నేస్తాలు ఎంతో ఉత్సాహంగా ఉరుకులు పరుగులు పెట్టినప్పుడు, ఆటలాడినప్పుడు, గెంతినప్పుడు... ఏదో కోల్పోయిన బాధ డేనియల్ మనసును మెలిపెట్టేది. తనూ వారిలో ఒకరిగా లేకపోయినందుకు ఎన్నిమార్లు ఏడ్చిందో...కన్నీళ్లు తుడుచుకుందో ఆమెకే తెలుసు.

"నేను కూడా నేస్తాల్లా ఎందుకు కాకూడదు. ఎందుకు నడవకూడదు. ఈ నాలుగు చక్రాల బండిలోంచి స్వేచ్ఛగా ఎందుకు బయటకు రాలేను? అందరు టీనేజీ అమ్మాయిల్లా నేనెందుకు వుండకూడదు? క్షీణించిన కాలి కింద జీవితాన్ని ఎందుకు నలిగిపోనివ్వాలి? అందరు నేస్తాలూ ఎంచక్కా ఐస్ మీద నృత్యం చేస్తారు. పరుగుపందేల్లో పాల్గొంటారు. ఆటలు ఆడతారు. కానీ నేను కేవలం ప్రేక్షకురాలిని. నాకూ ఆటలు ఆడాలని, గెలుపొందాలని, కప్పులు సంపాదించాలని, అటు టీచర్ల దగ్గర ఇటు అమ్మానాన్నల దగ్గర మెప్పు పొందాలని వుంది. నేస్తాల అభినందనలు అందుకోవాలని వుంది. కానీ...అవన్నీ కేవలం కోరికలుగానే, ఆశలుగానే మిగిలిపోతున్నాయి. అన్నీ ఈ కాలి వల్లే. అసలు ఆ కాలే లేకపోతే...కృత్రిమ కాలు పెట్టించుకుంటే...." అన్న ఆలోచనలు డేనియల్‌లో వచ్చాయి.

అంతే! అమ్మానాన్నలతో కలిసి ఎన్నో వందల సార్లు ఆసుపత్రుల మెట్లు ఎక్కి దిగింది. కానీ ఒక్క డాక్టర్ కూడా తన ఆశలు తీరే సలహా ఇవ్వలేకపోయారు. అటువంటి పరిస్థితుల్లోనే ఆ కఠిన నిర్ణయాన్ని చెప్పేసింది. అందుకు తల్లిదండ్రులు కూడా అంగీకారం తెలిపారు.

◆◆◆

కానీ... ఆపరేషన్ చేసి నిర్ధకంగా అంటిపెట్టుకున్న కాలిని తొలగించడమంటే... చిన్న విషయం కాదు. వైద్యులు కూడా ఆమె అందించిన భరోసాతో ముందుకు కదిలారు. అవయవఛేదనం జరిగిపోయింది. అనంతరం కృత్రిమ కాలిని ఏర్పాటు చేశారు.

అలా నాలుగు చక్రాల బండిలోంచి స్వేచ్ఛ పొందడానికి పెద్ద పోరాటమే చేయాల్సివచ్చింది డేనియల్. ఇంట్లో పెద్దలను, బయట వైద్యులను ఒప్పించి ఆపరేషన్ చేయించుకొని, పెట్టుడు కాలు సాధించడానికి అలుపులేని పోరు సాగించింది డేనియల్. ఎట్టకేలకు తను కలలు కన్న రోజు రానే వచ్చింది అందరు నేస్తాల లాగే ఓరోజు తనంతట తానుగా నడుచుకుంటూ పాఠశాలలోకి అడుగెట్టింది. అదో అద్భుత-అనిర్వచనీయ అనుభూతి. మేఘాలమీద నడిచినంత ఆనందం. అసాధ్యమనుకున్నది సుసాధ్యమైన ఆనంద ఘడియను ఎన్నటికీ మరువలేదు డేనియల్. ఇప్పటికీ వైద్యులు చెప్పిన వ్యాయామాలు విడవకుండా చేస్తోంది. మరి తను ఎక్కాల్సిన మెట్లు ఇంకా వున్నాయిగా. సొంతగా వేస్తున్న అడుగులకు మరింత వేగాన్ని అద్ది పరుగులు తీయించాలన్నది ఆమె కోరిక. ఇప్పటివరకు తను కూర్చున్న ప్రేక్షకుల గ్యాలరీలో మిత్రులు, బంధువులు కూర్చుని తను పాల్గొన్న క్రీడలను తిలకించాలని ఆ చిన్ని హృదయం తహతహలాడుతోంది. పారాలింపిక్స్‌లో పాల్గొని కప్పులు కొట్టేయాలన్నది ఆ చిన్నారి తపన. అందుకు అవసరమైన విధంగా కృత్రిమ కాలుకు మరిన్ని మెరుగులు దిద్దించాలన్నది ఆమె పట్టుదల.

- చరిత

ఆఖరి పలుకులు



ఓ మనిషి చివరి ఘడియల్లో ఏం చెప్పాడనేది ఎప్పుడూ ఆసక్తికరమే. సినిమాల్లో అయితే ఇలాంటి సన్నివేశాలను మరింత ఉత్సుకత కలిగించేలా చిత్రీకరిస్తుంటారు. ఇవన్నీ సామాన్యుల విషయంలో. మరి సుప్రసిద్ధ వ్యక్తులు ఆఖరి నిముషాల్లో ఏం మాట్లాడారనేదానిపై ఇంకెంత ఆసక్తి వుండాలి?! ఎప్పుడూ వార్తల్లో అంశమే. మరైతే తన అద్భుతమైన నటనతో హాస్యాన్ని పండించిన చార్లీచాప్లిన్ మొదలుకొని విప్లవ వీరుడు చేగువేరా వరకు ప్రముఖుల ఆఖరి పలుకులుగా ప్రచారంలో వున్నవేంటో చూద్దామా!





ఐన్‌స్టీన్ సుప్రసిద్ధ శాస్త్రవేత్త. ఆయన చివరి ఘడియల్లో ఏదో చెప్పడానికి తెగ పరితపించారు. అయితే ఆ మాటలు ఏవిటో తెలుసుకోవడానికి అక్కడే వున్న నర్సుకూడా చాలా ప్రయత్నించింది. కానీ ఆమె వల్ల కాలేదు. కారణం ఆయన జర్మన్ భాషలో ఏదో చెప్తున్నాడు. ఆమెకు ఆ భాష రాదు. అలా ఆ ప్రఖ్యాత శాస్త్రవేత్త ఆఖరి క్షణాల్లో చెప్పదలచుకున్నదేంటో ప్రపంచానికి తెలియకుండా గాల్లో కలిసిపోయింది. అందాలరాణిగా పేరుగాంచిన క్లియోపాత్రా పాముతో కాటు వేయించుకుని చనిపోయిందన్న విషయం ప్రచారంలో వుంది. ఆమె పాము కాటు వేయగానే 'ఆ, ఇక్కడుంది (సో హియర్ ఇట్ ఈజ్) అన్నదంటారు. చార్లీ చాప్లిన్‌ను 'దేవుడు నీ ఆత్మకు శాంతిని ప్రసాదించుగాక' అని ఫాదర్ దీవిస్తే 'ఆ ఎందుకు ప్రసాదించడు, ఆఫ్టాల్ అది (ఆత్మ) ఆయన ఆస్తే కదా' అంటూ ఆ క్షణాల్లో కూడా కామెడీని పంచాడు. ఇంక ఫోన్‌ను కనిపెట్టిన అలెగ్జాండర్ గ్రాహంబెల్ పలికిన చివరి పదం 'నో'. ఈ క్షణంలోనో మరుక్షణంలోనో అన్నట్టున్న ఆయన చెవిలో చెవిటి భార్య 'నన్ను వదిలిపెట్టి వెళ్లరుగా' అని గుసగుసలాడిందట. దానికాయన చెప్పిన సమాధానమే 'నో'. కాకపోతే భార్యకిచ్చిన మాట నిలుపుకోలేకపోయాడు పాపం. తన 'పెట్టుబడి'తో ప్రపంచాన్నే ఆలోచింపచేసిన కారల్ మార్క్స్ చివరిసారిగా అన్నాడని చెప్పే మాటలు కూడా ఆలోచింపచేస్తాయి. 'జీవితంలో ఏమీ చెప్పలేకపోయిన మూర్ఖుల్లాంటి వారికే ఈ చివరి మాటల్లాంటివి, నాకలాంటివేం లేవు. ఇక్కణ్ణించి ఫో' అని తన హౌస్‌కీపర్‌ను విసుక్కున్నాడంటారు. ఉత్తేజానికి మారుపేరుగా నిల్చిపోయిన చేగువేరా తనను చంపడానికి వచ్చిన బొలీవియన్ సార్జంటుతో 'నన్ను చంపడానికే ఇక్కడికొచ్చారన్న విషయం నాకు తెలుసు. కానీ మీరు చంపబోయేది ఒక మనిషిని మాత్రమే' అన్నాడట ఆఖరిసారిగా. లేడీ డయానా రోడ్డు ప్రమాదంలో మరణించిన విషయం తెలిసినదే. ఆమె చివరిసారిగా 'ఏం జరిగింది? (వాట్ హేపెండ్)' అని మాత్రమే అన్నారట.

ఇవి విదేశీ ప్రముఖుల ఆఖరి మాటలుగా ప్రచారంలో వున్నవి. మరి మన నేతల చివరి పలుకులేమిటో చూద్దాం.

గాంధీజీ తుదిపలుకులేంటని అడిగితే టక్కున వచ్చే సమాధానం 'హే రామ్'. కానీ కొందరు మాత్రం దీన్ని ఒప్పుకోరు. కేవలం 'ఆహ్...' అని గాలి వదలడం తప్ప గాంధీ ఏమీ అనలేదంటారు అనేకమంది. ఇక మన ప్రథమ ప్రధాని నెహ్రూ ఆఖరిమాటలేంటో తెలీదు కానీ... ఆయన చివరిసారిగా ఓ కాగితం మీద రాసుకున్న కవిత మాత్రం దొరికిందట. ఇక సెక్యూరిటీ గార్డుల చేతిలోనే ప్రాణాలొదిలిన ఇందిరాగాంధీ చివరి మాటలు దొరికే అవకాశమే లేదనుకోండి. రాజీవ్ గాంధీ మాత్రం తను చనిపోవడానికి కొద్ది సేపటి ముందర 'డోంట్ వర్రీ, రిలాక్స్' (అదీ ఏదో మాటల సందర్భంగా) అన్నారని అంటారు. ★

కవిత్వమ్

రెండు నాల్కల సందేశం

పోస్టుమార్టం రిపోర్టు వెలువడింది
వేనోళ్లు పొగడ్తలంది
వెల్లివిరిసిన అతడి సంఘసేవ
గోముఖ వ్యాఘ్రమైంది
అమావాస్యను వెలుగుచేసి
వెలుగును వెలుగుతో హత్య చేయడం
నిరక్షరాస్యుణ్ణి అక్షరాస్యుణ్ణి చేసి
అక్షరాన్ని అక్షరంతో అంతం చేయడం
పోస్టుమార్టం రిపోర్టు వెల్లడి!
ప్రజలు జేజేలు పలికి
ప్రశంసలు పొందిన అతడి స్త్రీ జనోద్ధరణ
మేడిపండు ఉదరమైంది
ఓలలాడిన వివాహేతర సంబంధాలు
మసైన కన్నెపిల్లల ఆశలు
అభాగినులపై అత్యాచారాలు
పోస్టుమార్టం రిపోర్టు వెల్లడి!
మింటి కెగసిన అతడి సమతావాదం
రెండు నాల్కల సందేశమైంది

మనుషులంతా ఒక్కటే
అన్ని మతాలూ సమతుల్యం
మానవుడే మహనీయుడన్న
ద్వంద్వ వైఖరి
ద్వేషాలు, వైషమ్యాలు పెంచి
అంతర్గతంగా రాజేసిన మంటలు

పోస్టుమార్టం రిపోర్టు వెల్లడి!
ధర్మబద్ధమై న్యాయబద్ధమై
నిల్చిన అతడి వ్యాపార కార్యక్రమం
చీకటి కోణమైంది
కలుషితమై కపటమై
బూటకమై సాగిన రీతులు
పోస్టుమార్టం రిపోర్టు వెల్లడి!
నిద్రలేచిన ప్రభుత్వం నివ్వెరపోయింది
నేల రెండుగా చీలి వేరు కాపురాలు పెట్టాయి
గర్జనలు, గాండ్రింపులు మొదలై
ఒక భాగం ఇంటింటా దీపావళి చేసుకుంది
ఒకభాగం ఇంటింటా మంటలు రాజేసింది
హింసను పసిగట్టిన ప్రభుత్వం
నిజ నిర్ధారణ చేయించింది
పద్మశ్రీలు, పద్మభూషణలు
స్వదేశీ విదేశీ వైద్య నిపుణుల కలయిక
పారదర్శక రిపోర్టు ప్రకటించింది
ద్వితీయ రిపోర్టు
ప్రథమ రిపోర్టును ధృవీకరించింది!

- అడిగోపుల వెంకటరత్నమ్

అక్షరం



మది గదిన తలపుల తలుపులు తెరచుకుంటున్నాయి
యాంత్రికత ఒరిపిడి విదిలించుకుంటూ
భావపరంపరకు అభిషిక్తం చేస్తూ...
మారాకు తొడిగిన మౌనపు తొడిమలు
వ్యక్తీకరించని మాటలై మౌనసంద్రంలో నిక్షిప్తమౌతూనే ఉన్నాయి
మస్తిష్కంలో పురుడు పోసుకున్న ఆలోచనలకు
సాలోచనను చేకూరుస్తూ...
అక్షరం సాక్షరరూపం దాల్చుతూ
నిబిడాంధకారపు లోతుల్లో కాంతిపుంజాన్ని వెదజల్లుతూ
భావయుక్త వీచికల్ని అంతరంగాన ఆవిష్కరిస్తూ...
ఒకానొక బాధాస్పద అనుభవాన్ని
భావగర్భిత కావ్యంగా మలచేందుకు
అక్షరం అనుక్షణం ఆలంబనగా నిలుస్తూ...
అవసరమైన వేళ ఆయుధంగా మారి
దివారాత్రుల్లు దిక్సూచియై
నను నడిపిస్తూనే ఉంది.

- ఇల్ల ప్రసన్న లక్ష్మి

నేటి కృష్ణుడు

నిన్నటి వరకు ప్రోత్సహించిన నాన్న
నిశ్చల నిద్రలో మునిగిపోయాడని
బంధు జనాలంతా రోదిస్తుండ
పార్థీవ శరీరంపై కన్నీటి ధారలు
ప్రవహింప చేస్తున్నది చిన్నారి
పాఠాలు చెప్పే గురువు
కర్తవ్యాన్ని మేల్కొలిపి
కృష్ణుడై గీతాబోధ చేయగా
కలము పట్టి కదిలింది
పరీక్షల రణరంగంలోకి
అల్లాపూర్ జ్యోతి వెలుగులను
కృష్ణుని విశ్వరూప దర్శనంతో
నాటి విజయుడు గెలిచినట్లు
నేటి జ్యోతి పరమేశ్వరుని మాటలు
మదిలో తలంచుకుంటూ
నాన్న కోరికలు తీరాలంటే
నేను ఆరిపోరాదు. ఈ పరీక్షతో
నాన్నకు సంతాపం ప్రకటిస్తానని
కండ్లు వర్షిస్తున్నా
మనసులో లక్ష్యసాధనకై
విధి వైపరీత్యాలకు వెరవకుండా
ఆగిపోకూడదంటూ చూసేవారికి
బోధిస్తున్న ఝాన్సీరాణిలా కదిలింది
గెలుపే లక్ష్యంగా నాన్న కలలు సాకారం చేయాలని.

- పెందోట వెంకటేశ్వర్లు

బీరకాయ - మెంతి పులుసు



కావలసిన పదార్థాలు

లేతబీరకాయలు - అరకేజి
ఎండు మిర్చి - 8
పచ్చి శనగపప్పు - 2 టీ స్పూన్లు
మినపప్పు - 2 టీ స్పూన్లు
జీలకర్ర - 1 టీ స్పూన్
నూనె - 1 టీ స్పూన్
మెంతులు - అర స్పూన్
చింతపండు - కొంచెం
ఉప్పు - తగినంత
పసుపు - చిటికెడు

తయారు చేసే పద్ధతి

ఎండు మిర్చి, పచ్చి శనగపప్పు, మినపప్పు, జీలకర్రను కొంచెం నూనెలో వేయించి పొడి చెయ్యాలి. మెంతులను విడిగా వేయించి పొడి చెయ్యాలి. బీరకాయలు ముక్కలుగా కొయ్యాలి. ఆవాలు, జీలకర్ర, మినపప్పుతో పోపుచేసి అందులో బీరకాయ ముక్కలు, పసుపు, ఉప్పు వేసి కలియబెట్టాలి. కొద్దిగా మగ్గిన తర్వాత మెంతిపొడి, చిక్కటి చింతపులుసు వేసి కలిపి మరో ఐదు నిమిషాలు ఉడికించాలి.

పాలకూర పులుసు

కావలసిన పదార్థాలు

పాలకూర - 1 కట్ట పెద్దది, కందిపప్పు - 1 కప్పు
పచ్చిమిర్చి - 10, చింతపండు - చిన్న నిమ్మకాయంత
ఉప్పు - తగినంత, పసుపు - చిటికెడు, పోపు సామాను - 2 స్పూన్లు

తయారు చేసే విధానం

ముందుగా పప్పును ఉడికించాలి. అది ఉడికిన తర్వాత అందులో తరిగిన పాలకూర, పసుపు, కోసిన పచ్చిమిర్చి, చింత పులుసు వేసి ఉడకనివ్వాలి. తర్వాత ఎండు మిరపకాయలు, ఆవాలు, జీలకర్ర, కరివేపాకుతో పోపు చేసుకోవాలి.



తోటకూరతో పొడి కూర

కావలసిన పదార్థాలు

తోటకూర - 8 కట్టలు, పచ్చిమిర్చి - 4
పెసరపప్పు - 3 స్పూన్లు,, కొత్తిమీర - చిన్న కట్ట
కరివేపాకు - 2 రెమ్మలు, ఉప్పు - తగినంత, పసుపు - చిటికెడు
కారం - 1 స్పూన్, పోపు సామాను - 1 స్పూన్

తయారు చేసే విధానం

పచ్చిమిర్చిని పొడవుగా తరగాలి. తోటకూరను సన్నగా తరగాలి. పెసరపప్పును నానబెట్టాలి. ఆవాలు, జీలకర్ర, మినపప్పు, ఎండుమిర్చితో పోపు పెట్టుకోవాలి. అందులోఉప్పు, పసుపు, కారం, నానబెట్టిన పెసరపప్పు వేసి మూత పెట్టి కొద్ది సేపు ఉడకనివ్వాలి. తర్వాత మూత తీసి మరి కొద్దిసేపు కూరని కలియబెడుతూ నీరు ఇంకిపోయేవరకు వేగనివ్వాలి. ఇలాగే పాలకూర, కందికూరను కూడా చేసుకోవచ్చు.

పులిచింతకూర పులుసుకూర



కావలసిన పదార్థాలు

పులిచింతకూర - 1 గిన్నె
పెసరపప్పు - 1 కప్పు
పచ్చిమిర్చి - 5
కారం - 1 స్పూన్
ఉప్పు - రుచికి సరిపడా
పసుపు - చిటికెడు
పోపు సామాను - 1 స్పూన్
ఇంగువ - చిటికెడు

తయారు చేసే విధానం

పెసరపప్పు కడిగి నీళ్లు, పసుపు వేసి ఉడకబెట్టాలి. అవి సగం ఉడికిన తర్వాత పులిచింతకూర, పచ్చిమిర్చి ఉప్పు, కారం, పసుపు వేసి ఉడకనివ్వాలి. ఈ పప్పు గట్టిగా కాకుండా కొంచెం జారుగా ఉండేట్లు వండుకోవాలి. ఉడికాక ఇంగువ, కరివేపాకు వేసుకుని పోపు చేసుకోవాలి. పులిచింత ఆకు పుల్లగా ఉంటుంది కాబట్టి చింతపండు వేయనవసరం లేదు.

ఆహ్వానం

ఘుమఘుమలాడే వంటకాలు చేయడంలో మీకు ఎనలేని ఆసక్తి వుందా! ప్రయోగాత్మక వంటకాలు చేసి అతిథులకు వడ్డించి మెప్పించగలరా! చవులూరింపచేసే సంప్రదాయ శాకాలు చేయడంలో దిట్టా! మరెందుకండీ ఆలస్యం? ఎంచక్కా వాటిని ఓ కాగితం మీద రాసి పంపండి. తగిన పారితోషికం అందుకోండి. ముఖ్యమైన విషయం! మీ చిరునామా పూర్తిగా రాయడం మరువకండి.

మీ రుచులు పంపాల్సిన మా అడ్రస్:
రుచి, ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి, మోటూరు హనుమంతరావు భవన్, 21/1, ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాదు.

"ప్రేరణ పొందని దర్శకులు ఎవరూ ఉండరు"



ఆయన సంగీత దర్శకుడై ఇప్పటికి సరిగ్గా పుష్కరకాలం గడిచింది. 1999 జనవరిలో సంగీత దర్శకుడిగా ప్రయాణం మొదలుపెట్టిన ఆయన ఈ 12 ఏళ్ళ కాలంలో 'సమరసింహారెడ్డి', 'నరసింహనాయుడు', 'ఖుషి', 'ఇంద్ర', 'ఒక్కడు', 'పోకిరి' - ఇలా అనేక రికార్డు హిట్ చిత్రాలకు సంగీతం సమకూర్చారు. పెద్ద హీరోల చిత్రాల మొదలు చిన్న దర్శకుల చిత్రాల వరకు చేతి నిండా సినిమాలతో ఇప్పటికీ తీరిక లేకుండా గడుపుతున్న ఆ వాణిజ్య సినీ సంగీత దర్శకుడు - మణిశర్మగా సుప్రసిద్ధుడైన యనమండ్ర వెంకట సుబ్రహ్మణ్య శర్మ. మాస్ పాటలతో ఎన్నో హిట్లొచ్చినా, మెలోడీ పాటలంటేనే తనకు ప్రాణమంటారు మణి. 150 చిత్రాల మైలురాయికి దగ్గరైన మణిశర్మతో ముఖాముఖి

సంగీతం నేర్చుకొని వచ్చిన మీరు సినిమాల్లో ఎలాంటి సంగీతం అందించాలనుకున్నారు?

సంగీత దర్శకుణ్ణి కాక ముందు నాకు సంగీతం మీద ఉన్న అభిప్రాయం, అభిరుచి, నేను అందించాలనుకున్న సంగీతం వేరు. కానీ, ఇక్కడ పరిస్థితి వేరు. ఇక్కడకు వచ్చాక నాకు అర్థమైంది ఏమిటంటే – సంగీతంలో నా విద్వత్తు చూపాలంటే నేను ఏ కచ్చేరీలో చేసుకుంటూ వెళ్ళాలి. అప్పుడు నాకంటూ ఉన్న ప్రతిభ వస్తుంది. కానీ, సినిమా అనేది వ్యాపారం. నన్ను సంగీత దర్శకుడిగా పెట్టుకొనే హీరోకూ, నిర్మాతకూ నాలుగు డబ్బులొచ్చేలా స్వరాలు కూర్చాల్సి ఉంటుంది.

కానీ, అలా చేసినా అన్ని సినిమాలూ ఆడడం లేదుగా!

సినిమా ఆడాలంటే అన్నీ కలసిరావాలి. నికృష్టమైన పాటలు కడితే, అనుకోకుండా అవి హిట్టయిన ఘటనలున్నాయి. 'మనోహరం', 'రావోయి చందమామా', 'దేవీపుత్రుడు', 'శ్రీఆంజనేయం', 'సుభాష్ చంద్రబోస్' లాంటి చిత్రాల్లో మంచి పాటలు చేసినా, సినిమాలు ఆడక, ఆ పాటలకు రావాల్సినంత పేరు రాకపోవడమూ జరిగింది.

చేసిన శ్రమకు తగ్గ ఫలితం రాకపోతే బాధ కాదా!

నిజమే! తొలిరోజుల్లో 'చూడాలని ఉంది', 'బావగారూ బాగున్నారా' లాంటి వరుస హిట్లతో పైకి ఎగబాకిన నా కెరీర్, 'గణేశ్' చిత్రంతో కొద్దిగా కిందకు దిగింది. ఆ తరువాత 'ఇద్దరు మిత్రులు' లాంటి ఫ్లాపులూ వచ్చాయి. అప్పట్లో నాకు ఫ్లాప్ వచ్చినా, నా పని మీద ఎవరైనా విమర్శలు చేసినా తట్టుకోలేకపోయేవాణ్ణి. కానీ, క్రమంగా స్థితప్రజ్ఞత అలవరచుకున్నా. అభినందనలు వచ్చినా, విమర్శలు వచ్చినా వినడమే తప్ప, మనస్సుకు ఎక్కించుకోవడం మానేశా.

అసలు సంగీతం మీద మీకు ఆసక్తి ఎలా కలిగింది?

మా నాన్న గారు వై. నాగయజ్ఞ శర్మ మంచి వాయులీన విద్వాంసులు. ఆయన 1950ల్లోనే మద్రాసుకు వచ్చి స్థిరపడ్డారు. సినీ సంగీత దర్శకుడు రమేశ్ నాయుడు వద్ద అసోసియేట్ సంగీత దర్శకుడిగా పనిచేశారు. వాళ్ళిద్దరూ బాగా సన్నిహితులు. సుప్రసిద్ధ సినీ గీతం 'జోరు మీదున్నావు తుమ్మెదా...' పాటలో వచ్చే ఆ వయొలిన్ బిట్ అంతా మా నాన్నగారు వాయించినదే. చిన్నప్పటి నుంచి నాకు సంగీతమంటే ఇష్టం. నాన్నగారి పని, వగైరా జాగ్రత్తగా గమనిస్తూ ఉండేవాణ్ణి. అయితే, నేను సంగీతం వైపు, సినిమాల వైపు రావడం ఆయనకు ఇష్టం ఉండేది కాదు. నేను బాగా చదువుకొని, బ్యాంకు ఉద్యోగం చేయాలని ఆయనకు ఉండేది. కానీ, నేను హార్మోనియం పెట్టుకొని, పాటలు వాయించడం చూసి, మా అమ్మే, నాన్న గారికి చెప్పి, ప్రోత్సహించింది. దాంతో, మా నాన్న గారు నాకు ఓ గురువు గారిని ఏర్పాటు చేసి, సంగీతంలో ప్రాథమిక అంశాలు బాగా నేర్పించారు. ఓ పియానో కొనిపెట్టారు. అప్పట్లో పాటలు వినాలంటే రేడియోనే గతి. ఇంట్లో అందరూ నిద్రపోతుంటే, రాత్రి 9 గంటల తరువాత కాసేపు రేడియోలో వచ్చే కొత్త సినిమా ప్రకటనల్ని సైతం తక్కువ శబ్దంలో పెట్టుకొని, ఒంటికాలి మీద నిలబడి వినేవాణ్ణి. అవన్నీ అయ్యాక అప్పుడొచ్చి పడుకొనేవాణ్ణి.

ఇంతకీ సినిమాల్లోకి ఎలా వచ్చారు?

అప్పట్లో నాకు ఇళయరాజా సంగీతమంటే తగని పిచ్చి. అది వినీ వినీ నా ఒంట్లో జీర్ణమైపోయింది. హాలులో కానీ, టీవీలో కానీ ఆయన సినిమా వస్తే చాలు, ఆయన పాటలు, రీ-రికార్డింగ్‌తో సహా అన్నీ రికార్డు చేసుకొని, పదే పదే వినేవాణ్ణి. అలా క్రమంగా కీ-బోర్డు ప్లేయర్‌గా మారాను. సినీ సంగీత విభావరులకూ, సినిమాలకూ వాయించడం మొదలుపెట్టాను. అక్కడ నుంచి సంగీత దర్శకుడిగా ఎదిగాను.

కీ-బోర్డు అనుభవం సంగీత దర్శకత్వానికి ఎలా తోడ్పడింది?

అదో చిత్రమైన సంగతి. మొదట్లో నేను మద్రాసులో ఏ.వి. రమణన్ సంగీత బృందానికి సినీగీత విభావరుల్లో కీ-బోర్డు వాయించేవాణ్ణి. ఆ సంగీత విభావరుల్లో 1950ల నాటి నుంచి అప్పటి తాజా పాటల దాకా, వివిధ పాటలు పాడేవారు. దాంతో, ఆ పాటలు వాయించడం కోసం స్వరాలన్నీ రాసుకోవాల్సి వచ్చేది. దాంతో, కాలానుగుణంగా సంగీతం ఎలా మారుతూ వచ్చిందో గమనించి, గ్రహించేందుకు వీలు కలిగింది. అప్పుడే మా నాన్నగారు నన్ను సంగీత దర్శకుడు సత్యం దగ్గర కీ-బోర్డ్ ప్లేయర్‌గా చేర్పించారు. అక్కడ మొదటి రోజుల్లో చాలా టెన్షన్ పడ్డా. 'ఈ వృత్తి వద్దురా బాబూ!' అని కూడా అనుకున్నా. కానీ, తరువాత క్రమంగా నిలదొక్కుకున్నా. ఆ పైన ఇళయరాజా, రాజ్-కోటి, విద్యాసాగర్, శంకర్ – గణేశ్, కీరవాణి, లక్ష్మీకాంత్ – ప్యారేలాల్, అనుమాలిక్ – ఇలా ఎంతోమంది దగ్గర కీ-బోర్డు వాయించాను. దేవరాజ్ మాస్టర్ దగ్గర నుంచి రాజమణి దాకా దక్షిణ భారతదేశంలో నేను కీ-బోర్డు వాయించని సంగీత దర్శకులు లేరంటే అతిశయోక్తి కాదు. కీరవాణి దగ్గర ఉన్నప్పుడే 'క్షణక్షణం' చిత్ర సమయంలో దర్శకుడు రామ్ గోపాల్ వర్మతో పరిచయమైంది. ఆయనే నాకు 'రాత్' చిత్రానికి రీ-రికార్డింగ్ అవకాశమిచ్చారు. ఆ తరువాత కూడా నేను మళ్ళీ కీ-బోర్డు ప్లేయర్‌గానే ఉండిపోయా. దర్శకుడు గుణశేఖర్ తన చిత్రానికి సంగీతం అందించాల్సిందిగా అడిగినా ఒప్పుకోకుండా, 'సొగసు చూడ తరమా' చిత్రానికి పూర్తిగా సంగీత నిర్వాహకుడిగా పనిచేశా. ఆ అనుభవమంతా ఆ తరువాత సంగీత దర్శకుడిగా నాకు ఉపయోగపడింది.

ఇంతకీ ఎప్పుడు, ఎలా సంగీత దర్శకుడయ్యారు?

రోజూ మూడు షిఫ్టుల్లో వేర్వేరు చోట్ల కీ-బోర్డు వాయిస్తూ, యాంత్రికంగా జీవితం గడుపుతున్న సమయంలో నేనంటూ ఏదైనా చేయాలనిపించింది. అందుకోసం సొంత రికార్డింగ్ స్టూడియో అవసరమని 1995లో మద్రాసులో

జాగా తీసుకొని, 'మహతి' రికార్డింగ్ స్టూడియో కట్టా. దాదాపు 6 నెలల పాటు కేవలం కంపోజింగ్ సాధన చేశా. అదే సమయంలో మద్రాసులో సినీ రంగంలో 3 నెలలు పెద్ద సమ్మె. దాంతో, 'దెయ్యం' సినిమా రీ-రికార్డింగ్ కోసం రామ్‌గోపాల్ వర్మ నన్ను బొంబాయికి పిలిచారు. 'ట్యూన్లు కట్టి వినిపించమ'ని అంటే, రెండు ట్యూన్లు సిద్ధం చేసి వినిపించా. ఆయన వాటిని తీసుకెళ్ళి, 'ఏ.ఆర్. రెహమాన్ చేసిన ట్యూన్ల'ంటూ తన తదుపరి చిత్ర నిర్మాత అశ్వినీదత్‌కూ, చిత్ర హీరో చిరంజీవికీ వినిపించారు. వారు ఆ పాటలు విని, 'బ్రహ్మాండంగా ఉన్నా'యనగానే, 'ఈ స్వరకర్త - మణిశర్మ అనే కొత్త కుర్రవాడ'ని వర్మ బయటపెట్టారు. అలా సంగీత దర్శకుడిగా నేను బుక్కయిన తొలి తెలుగు సినిమా అశ్వినీదత్ - చిరంజీవి - వర్మల కాంబినేషన్‌లోది. ఆ తరువాత వర్మ దానిలో నుంచి తప్పుకున్నారు. చివరకు కథ మారి, గుణశేఖర్ దర్శకత్వంలో, నా సంగీతంతో 'చూడాలని ఉంది'గా ఆలస్యంగా వచ్చింది. దాని తరువాత మొదలై, ముందుగా విడుదలైన 'సూపర్ హీరోస్' చిత్రం నా తొలి చిత్రమైంది. ఇప్పటికి 85 మందికి పైగా వేర్వేరు దర్శకులతో పనిచేశా. ఈ రంగంలో నాకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్నా.

సమకాలీన సంగీత దర్శకులతో మీ అనుబంధం?

ఇప్పుడున్న సంగీత దర్శకులు అందరితోనూ నాకు చక్కటి అనుబంధం ఉంది. చిన్నతనంలోనే సంగీత దర్శకుడైన దేవిశ్రీ ప్రసాద్ తొలి చిత్రం 'దేవి'కి నేను కీ-బోర్డు వాయించాను. అలాగే, నేను సంగీత దర్శకుడినయ్యాక అతను నాకు కీ-బోర్డు వాయించాడు. ఎన్నో పాటలకు కోరస్, ట్రాక్ పాడాడు. ఇక, హ్యారిస్ జైరాజ్ నా దగ్గర 'అన్నయ్య' చిత్రం దాకా దాదాపు 30 - 40 సినిమాలకు కీ-బోర్డు వాయించాడు. నేను స్వయంగా రాజ్-కోటి, కీరవాణి దగ్గర కీ-బోర్డు వాయించాను. రాజ్-కోటి దగ్గర ఏకకాలంలో నేను, ఏ.ఆర్. రెహమాన్ కీ-బోర్డు ప్లేయర్లుగా పనిచేశాం. అందుకే, సమకాలీన సంగీత దర్శకులందరితో నాకు చక్కటి బంధం ఉంది. మేమంతా ఓ సంగీత కుటుంబంలా ఉంటాం. మా మధ్య పోటీ ఉంటుంది. అదే సమయంలో స్నేహమూ ఉంటుంది. అందరి మధ్యలో నాకంటూ ఓ స్థానమూ ఉంటుంది.

ఇవాళ ఎవరు పడితే వాళ్ళు సంగీత దర్శకులైపోతున్నారే!

అదే నా ఆవేదన కూడా! ఇవాళ హీరోలు, నృత్య దర్శకులు, ఫైట్ మాస్టర్లు కూడా సంగీతంలో వేలు పెడుతున్నారు. దర్శకుడు తన కథకూ, సన్నివేశానికీ కావాల్సిన బాణీ గురించి సలహా ఇస్తే ఫరవా లేదు. కానీ, తేరగా దొరికింది కదా అని ఇవాళ ప్రతి ఒక్కరూ సంగీతంలో జోక్యం చేసుకుంటున్నారు. పాటకు శ్రావ్యమైన బాణీ కట్టి, దానికి తగ్గట్లు బీజియమ్ ఇస్తే, ఆ బీజియమ్‌కు ఎలా స్టెప్పులు వేయించాలో తెలియని నృత్య దర్శకులేమో ఫాస్ట్ బీట్ లేదంటూ ఆ బీజియమ్‌ను కట్ చేసే దౌర్భాగ్యం మన పరిశ్రమలోనే చూస్తున్నాం.

మరి, సంగీత దర్శకత్వం వహించాలంటే ఏం కావాలంటారు?

అనుభవం చాలా ముఖ్యం. కీరవాణికి చక్రవర్తి గారి దగ్గర పని చేసిన అనుభవం ఉంది. రెహమాన్ కూడా కోటి సహా ఎంతోమంది దగ్గర నలిగాడు. మా గురువు గారు ఇళయరాజాతో సహా ఎంతోమంది సంగీత దర్శకులతో నేను పనిచేశా. ఇలా అనుభవమనే పునాది ఉన్నవాళ్ళు సినీ సంగీత రంగంలో విఫలమైనట్లు చరిత్ర లేదు. ఒక్క మాటలో చెప్పాలంటే - సంగీత సృజన ఓ పవిత్రమైన వృత్తి. ఎం.ఎస్. విశ్వనాథన్, కె.వి. మహదేవన్, ఇళయరాజా లాంటి సంగీత బ్రహ్మలు కూర్చున్న ఆ ఉన్నతమైన స్థానంలో కూర్చోవాలంటే నాకు ఇప్పటికీ వణుకే. కానీ, ఆ పరిజ్ఞానం, అనుభవం, తమ పరిమితులు తెలియకుండా సంగీతంతో సంబంధం లేని వాళ్ళు కూడా ఆ సీటులోకి వచ్చేస్తున్నారు. అలా ఎవరికి వారు తాము సంగీత దర్శకులమంటే ఎలా?

హీరోను బట్టి, బడ్జెట్‌ను బట్టి మీరు సంగీతం అందిస్తారా?

అలా కాదు! సంగీతం అనేది సృజనాత్మక ప్రక్రియలో సంభవించే ఓ రసాయనిక చర్య. అది ఎప్పుడు, ఎలా జరుగుతుందని వివరించలేం. చెప్పిన కథ, అందులోని వాతావరణం, దర్శకుడి శైలి - వీటిని బట్టి సంగీత దర్శకుడు ఓ మానసిక స్థితిలోకి వెళతాడు. అప్పుడు మనకే తెలియని ఓ ఉన్నత చైతన్యం పలికించేదే బాణీ. ఆ వచ్చిన ట్యూన్‌కు శ్రమించి, మెరుగులు దిద్దడం సంగీత దర్శకుడు చేయాల్సిన పని. దీనికి బడ్జెట్ పెద్దదా, చిన్నదా, హీరో ఎవరు అన్న దానితో సంబంధం లేదు.

సినిమా విజయంలో సంగీతం పాత్ర ఏమిటి?

సినిమా అనేది 24 విభాగాల సమాహారం. అందులో సంగీతం ఒకటి మాత్రమే. ఆ సంగతి గుర్తించాలి. కానీ, ఇవాళ సంగీత విభాగం మీద ఎక్కువ ఒత్తిడి తెస్తున్నారు. కొన్నిసార్లు మనం చేయని తప్పుకు కూడా మన మీద విమర్శలు వస్తుంటాయి, భారం పడుతుంటుంది. తప్పదు.

ఎంతోమంది సంగీత దర్శకుల దగ్గర పనిచేశారు కదా! మీ మీద వారి ప్రభావం ఎంత?

ఇందాకే చెప్పుకున్నట్లు, నేను పని చేసినంతమంది సంగీత దర్శకుల దగ్గర మరి ఏ ఇతర సమకాలీన మ్యూజిక్ కంపోజర్ పని చేయలేదు. నేనే సంగీత దర్శకుడిగా కూర్చున్నప్పుడు వారెవరి బాణీలూ కలవకుండా నాదైన ట్యూన్ చేయాలి. కానీ, అందరికీ ఉండేది ఆ ఏడు స్వరాలే! అదే ఓ సవాలు.

అంటే, మీరెప్పుడూ ఇతరుల బాణీలు కాపీ కొట్టలేదంటారు?

(నవ్వుతూ...) కాపీ వేరు, ప్రేరణ వేరు. అయినా, సినీ గీత ప్రియులకు నేనిచ్చే సలహా ఒకటే! ప్రతి పాటనూ శోధించడం మానేయండి. పాటలు విని ఆనందించడానికి ప్రయత్నించండి. ఎవడు, ఎక్కడ నుంచి, ఏది కొట్టేశాడని శోధించడంతోనే సమయం గడిపేయకండి. కాపీ కొట్టని, ప్రేరణ పొందని సంగీత దర్శకుడు ఎవరూ ఉండరు. దర్శక - నిర్మాతల బలవంతం మీద కొన్నిసార్లు ఆ పనికి దిగాల్సి వస్తుంది. నా కెరీర్‌లో అలా రెండుసార్లు జరిగింది. ఎన్టీఆర్ జూనియర్ 'ఆది' చిత్రంలోని 'చిక్ చిక్ బం బం...' పాట ఓ స్పానిష్ గీతానికి అనుసరణ. అలాగే, పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో మరో సినిమాకు కూడా వారి బలవంతం మీద అనుకరించా. ఒక్కసారి మాత్రం నా అంతట నేనుగా చేశాను. తమిళ హిట్ 'ఖుషి'లోని పాట బాణీనే యథాతథంగా వాడాల్సిందిగా నిర్మాత ఏ.ఎం.రత్నం కోరితే, నేను ఆ బాణీని కొంత మార్చి, 'అమ్మాయే సన్నగా అరనవ్వే నవ్వగా...' అంటూ కొత్తగా వినిపించేలా ఆ పాట చేశాను. అది కాపీ కాకపోయినా, ప్రేరణ పొంది చేసినదే! గమ్మత్తేమిటంటే - తమిళంలో నుంచి పుట్టిన 'అమ్మాయే సన్నగా...' బాణీ మళ్ళీ 'షాజహాన్' అనే తమిళ చిత్రంలో 'అచ్చొచ్చో పున్నగై...' పాటగా మళ్ళీ తమిళంలోకే వెళ్ళడం! (నవ్వులు...)

కానీ, మీరు పరభాషల్లో తక్కువ సినిమాలు చేశారేం?

తమిళంలో విజయ్ హీరోగా చేసిన 'షాజహాన్' మొదలుకొని ఓ 20 సినిమాలకు సంగీతం అందించా. కన్నడంలో రవిచంద్రన్ హీరోగా నటించిన 'ప్రేమక్కే సై' మొదలు 3 సినిమాలకు సంగీత దర్శకత్వం వహించా. నిజాయతీగా చెప్పాలంటే, ఇతర భాషల్లో నాకు అవకాశాలు తక్కువగా వస్తున్నాయి. నాకేమో వెళ్ళి అవకాశాలు అడగడం ఎప్పుడూ, ఎక్కడా అలవాటు లేదు.

మీ భవిష్యత్ ప్రణాళికలు?

నాకు ఎలాంటి ప్రణాళికలూ లేవు. ఏదో సాధించాలని పెద్దగా కోరికలూ లేవు. (నవ్వుతూ...) ఇంకా చెప్పాలంటే, ప్రస్తుతం నాకైతే రిటైరవ్వాలని ఉంది. అంటే సినిమాల నుంచి పూర్తిగా రిటైర్మెంట్ అని కాదు. కొద్దికాలం విశ్రాంతి తీసుకొని, మళ్ళీ బరిలోకి దూకాలని ఉంది.

మీ ఏకైక సంతానం సాగర్ మీకు సంగీతంలో సాయం చేస్తున్నట్లున్నారు?

(నవ్వుతూ...) మా వాడికి సంగీతమంటే ఇష్టం. పియానోలో ఆరు గ్రేడులు కూడా పాసయ్యాడు. ఏడో గ్రేడు దాకా వచ్చాడు. అది కూడా పూర్తి చేస్తే, డిగ్రీ వచ్చేది. కానీ, వాడు అక్కడ ఆపేశాడు. ప్రస్తుతం తన సొంత కెరీర్ మీద దృష్టి పెడుతున్నాడు.

మీ అబ్బాయి త్వరలో హీరో కానున్నాడని వార్త!

ఇప్పుడే నేనేమీ చెప్పలేను. వాడికి రకరకాల ఆలోచనలున్నాయి. 'ఒక్క ఏడాది ఆగు నాన్నా! స్పష్టంగా చెబుతా!' అన్నాడు. అప్పుడు వాడు ఏ నిర్ణయం తీసుకుంటాడో అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. నాలాగా మీరు కూడా ఎదురుచూడండి. (నవ్వులు...)

- రెంటాల జూనియర్

నవ్వుల్ - పువ్వుల్

చీకట్లో రాత

(కరెంటు పోయినప్పుడు...)

పిల్లవాడు: నాన్నా! మీరు చీకట్లో కూడా రాయగలరా?

తండ్రి: ఓ...ఎంచక్కా రాసేస్తానోయ్. అయినా ఏం రాయాలేంటి?

పిల్లవాడు: ప్రోగ్రెస్ రిపోర్టు మీద నీ పేరు రాయాలి నాన్నా!

సోదరభావం



రాము: ఒరేయ్! ఒకడు ఓ గాడిదను తంతుంటే నేను ఆపాను. ఎందుకంటావ్?

సోము: సోదరభావంతో.

వాయించగలనా!

రోగి: డాక్టర్! ఈ ఆపరేషన్ తర్వాత నేను వయొలిన్ వాయించగలనా!

డాక్టర్: ఎంచక్కా...ఎందుకలా అడిగావ్?

రోగి: ఎందుకంటే...నాకు అంతకముందు వయొలిన్ వాయించడం రాదుగా.

నీ పేరే

(ఒక లాయరుతో ...)

వ్యక్తి: నువ్వు మోసగాడివి. కేసు అడ్డం పెట్టుకొని నా ఆస్తంతా అమ్మించేశావు. నువ్వు దగాకోరువి. లంచగొండివి.

లాయరు: నువ్వు మరీ ఫీలవుతావని ఆ డబ్బుతో కొన్న ఇంటికి నీ పేరే పెట్టానయ్యా.

పిసినారి

(ఓ వ్యాపారవేత్త తన చివరిక్షణాల్లో మంచం మీద పడున్నాడు)

వ్యాపారవేత్త: ఓ నా పెళ్లామా! ఎక్కడున్నావు?

భార్య: ఇక్కడే వున్నానండీ.

వ్యా: ఓ.... నా పిల్లలూ ఎక్కడున్నారు?

పిల్లలు: ఇక్కడే వున్నాం నాన్నా.

వ్యా: మరి ముందు గదిలో ఫ్యాను తిరుగుతోందేంటి?

తలపని

బార్బర్: నీ వయసెంతోయ్!

పిల్లవాడు: ఎనిమిదేళ్లు.

బార్బర్: అయితే తల పనికి వచ్చావా?

పిల్లవాడు: షేవింగ్‌కైతే రాను కదా మరి.

అరటి పండు

వ్యక్తి: ఒక్కో అరటి పండు ఎంతకిస్తావు బాబూ?

షాపువాడు: 2 రూపాయలు సార్.

వ్యక్తి: 1.50కు ఇవ్వవా?

షాపువాడు: అంతకు తొక్క మాత్రమే వస్తదండీ.

వ్యక్తి: అయితే ఈ 50 పైసలు తీసుకొని పండు ఇచ్చేయ్. తొక్క నువ్వు అట్టిపెట్టుకో.

మంచి-చెడు

పల్లవి: మంచి లాయరుకి, చెడ్డ లాయరుకి మధ్య తేడా ఏంటి?

గీత: చెడ్డ లాయరైతే ఒక కేసును చాలా సంవత్సరాలు సాగదీస్తాడు. అదే మంచి లాయరైతే ఎప్పటికి ముగియకుండా నడిపిస్తూనే వుంటాడు.

తలకు షేవింగ్

కస్టమర్: షేవింగ్ చేస్తే ఎంత?

బార్బర్: 25 రూపాయలు

కస్టమర్: తల పని చేస్తే ఎంత?

బార్బర్: 50 రూపాయలు

కస్టమర్: అయితే తలకు షేవింగ్ చేయి.

ఎవరిది?

టూరిస్టు: ఇది ఎవరి అస్థిపంజరం?

గైడ్: టిప్పు సుల్తాన్ ది

టూరిస్టు: దాని పక్కనే వున్న చిన్న అస్థిపంజరం ఎవరిది?

గైడ్: అది టిప్పు చిన్నప్పటిది.

జోక్స్ బాగా వేస్తారా? మరైతే ఆలస్యం ఎందుకు! కార్డు మీద రాసి పంపండి. పాఠకులను కడుపుబ్బ నవ్వించండి. మా చిరునామా:
స్నేహ, ప్రజాశక్తి దినపత్రిక, ఎం.హెచ్.భవన్, ప్లాట్‌నెం.21/1, ఆజామాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాద్

కొత్త పుస్తకాలు

ప్రాక్పశ్చిమ దర్శనాలు

పండితులు, త్రిపీరికాచార్యులు, మార్క్సిస్టు మేధావి అనదగిన రాహుల్ సాంకృత్యాయన్ 1940 నుండి 42 వరకు కమ్యూనిస్టు రాజకీయ ఖైదీగా దేవలీ, హజారీబాగ్ జైళ్లలో ఉన్నప్పుడు రాసిన గ్రంథాల్లో 'దర్శన్ దిగ్దర్శన్' అనే గ్రంథం ఒకటి. పన్నెండు అధ్యాయాలుగా సాగిన ఈ గ్రంథానికి ఆలూరి భుజంగరావు చేసిన తెలుగు అనువాదమే ఈ 'ప్రాక్పశ్చిమ దర్శనాలు' గ్రంథం.సోక్రటీస్ నుండి మార్క్స్ వరకూ వారివారి జీవితాలనూ, వారి దార్శనిక సిద్ధాంతాలనూ ఈ గ్రంథంలో వివరించడం జరిగింది. ఆలూరి భుజంగరావుకు హిందీభాష మీద మంచి పట్టు, తెలుగులో స్వయంగా సృజనాత్మక రచయిత కావడం వల్ల ఈ అనువాదం ఏదో కొరుకుడుబడని కొయ్యలా కాకుండా సాధారణ జిజ్ఞాసులైన పాఠకులందరికీ విషయ వివరణం చేయగలిగేదిగా ఉంది. యవ్వన దర్శనపు తొలిదశ, ఉన్నత స్థితి, అంతిమ స్థితిలు వివరిస్తూ సోక్రటీస్, ప్లేటో, అరిస్టాటిల్, అగస్టిన్‌ల గురించి ఆ తరువాత ఇస్లామ్ దార్శనికులు, మీమాంసకుల గురించి, ఆపై స్పెయిన్‌లోని ఇస్లామిక్ దార్శనికుల గురించీ వివరించి యూరప్ దర్శనంతో అద్వైత భౌతిక, విజ్ఞానవాదాల గురించి, బుద్ధివాదం గురించి చివరిగా 19వ శతాబ్ది దార్శనికులు అయిన హెగెల్, షోపన్‌హర్, నిట్జ్‌సే, అజ్ఞేయ, మార్క్స్ వాదాల గురించి వివరించడం జరిగింది. "మార్క్స్ విశ్వవిద్యాలయంలో దర్శనాన్ని అభిమాన విషయంగా అధ్యయనం చేశాడు. అచిరకాలంలోనే ప్రథమ శ్రేణికి చెందిన దార్శనికుడయ్యాడు. ఐతే ఇతని రాజకీయ సామాజిక ఆర్థిక పరమైన భావాలు అత్యంత ఉగ్రమైనవీ, ప్రగతిశీలమైనవీ కావడం వల్ల పైన చెప్పిన రంగాల్లోనే ఇతడికి పేరు ప్రతిష్టలు లభించాయి. దార్శనికుడన్నది రెండవ స్థానానికి పోయింది. ఇలా మార్క్సును దార్శనికుడిగా గుర్తించకపోవడానికి మరో కారణమూ ఉంది. కళల్లాగానే దర్శనమూ తిని కూర్చుని సరదాగా కాలం గడిపే పరాన్న భుక్కులైన సోమరిపోతులకు వినోదాన్నిచ్చే విషయంగా వుండేదా రోజుల్లో! ఐతే మార్క్స్ దర్శనం అలాంటిది కాదు కదా? ఆ వర్గానికి ఎందుకూ ఉపయోగపడదు సరికదా వారికి హానికరమైంది! అలాంటప్పుడు మార్క్సును దార్శనికుడిగా ఎందుకు అంగీకరిస్తారు వాళ్లు?" అంటాడు రాహుల్ సాంకృత్యాయన్. ఆధునిక యుగంలో యూరప్‌కు చెందిన అభౌతిక వాద దర్శనాల పరిపూర్ణ వికాసం హెగెల్ దర్శనంలో కనిపిస్తుంది. ఇక సమస్త మానవజాతి యొక్క భౌతికవాద దర్శన పరిపూర్ణ వికాసం మార్క్స్ దర్శనంలో దర్శనమిస్తుంది అన్నమాట యథార్థం. కబీరుదాసు అంతటి వాడే మార్క్స్ మాటను అంగీకరిస్తున్నట్లుగా "నా కుఛ్ దేఖా భావ భజనమే/ నా కుఛ్ దేఖా పోథీమే/కహై కబీరు సునో భయి సంతో/జూ దేఖా సో రోటీ మే" అన్నాడు. అంటే భజన చేయడం ద్వారానే, ధార్మిక గ్రంథ పఠనం వల్ల గానీ సత్యమైన తత్వాన్ని పొందలేకపోయాను. రొట్టె (ఆహారం)లోనే సత్యతత్వం దర్శనం ఇస్తోంది అని! మార్క్సువాదం చెప్పేదీ అదే అంటూ సాంకృత్యాయన్ "మీరు ఒక వస్తువును తెలుసుకున్నారంటే దాన్లో భావం కూడా కలిసే ఉంటుంది! అంటే మీకు ఎర్రగా కాలిన ఇనుపచువ్వ యొక్క ఎరుపు, దాని వేడి మాత్రమే తెల్సు అనుకోవడం పొరపాటు! దాని తాలూకు అనుభూతి, బాధ మీకు తెలుస్తుంది. అది కేవలం మీ కల్పన మాత్రమే కాదు! వస్తుస్థితిని తిరస్కరిస్తే ఇక జ్ఞానాన్ని పొందడమే అసంభవం అవుతుంది. జ్ఞానం యొక్క అస్తిత్వాన్ని అంగీకరించాక ఇంక దాని తాలూకు ఇతర అంగాలకూ అంగీకరించవల్సి వస్తుంది. జ్ఞానం, జ్ఞాతా, జ్ఞేయం ఈ మూడింటినీ అంగీకరించక తప్పదు. తెలుసుకునేవాడు తెలుసుకోబడే వస్తువు లేకుండా తెలుసుకోవడం ఎలా" అని విశ్లేషిస్తాడు. ప్రాక్పశ్చిమ దర్శనాలు గ్రంథం ఆస్తికులు, నాస్తికులు ఎవ్వరైనా చదవాల్సిన గ్రంథం.

రాహుల్ సాంకృత్యాయన్ ప్రాక్పశ్చిమ దర్శనాలు, అనువాదం : ఆలూరి భుజంగరావు, ప్రతులకు: విశాలాంధ్ర బుక్‌హౌస్, పేజీలు: 278, వెల : 130/-.

- సుధామ

మనసును తేటపరిచే 'దుఃఖ్ఖాంతి'



దుఃఖం అంచుల్ని తాకగలం. లోతుల్ని చూడగలం. పలవరించగలం. కానీ, దుఃఖం అంతు చూడలేం. ఎందుకంటే- భూగోళంలో భూమి కన్నా నీళ్లే ఎక్కువున్నట్లు, జీవితంలో సుఖం కన్నా దుఃఖమే ఎక్కువ. ఆనంద క్షణాల కన్నా ఆవేదన శకలాలే ఎక్కువ. ఇలాంటి దుఃఖ శకలాలను అక్షరీకరించిన కవితా సంపుటి 'దుఃఖ్ఖాంతి'. యువ కవి, పాత్రికేయుడూ అయిన బిబి జోగేష్ తన ప్రథమ ప్రయత్నంగా దీనిని వెలువరించారు.

కవి అంతరంగపు లోతులు కొంత అందిన తర్వాత, ఈ కవిత్వంలోని 'అస్పష్ట దృశ్యాలు', 'అతిక్రమణ రేఖలు', 'నిర్‌వీర్యం'లు, 'దేహమూ-దాహమూ'లు, ఒంటరి నక్షత్రాలు, 'దాహార్తి'లూ అర్థమవుతాయి. ఈ సంపుటి తొలి కవిత 'అస్పష్ట దృశ్యాలు'తో మొదలై 62వ కవిత 'చితాఖర్మ'తో ముగుస్తుంది. 'వెన్నెల సోయగాలు', 'ప్రేమకథలు', 'అమృత వీక్షణం', 'వికసిత నేత్రం', 'చెదరని జ్ఞాపకం', 'కెన్ సారోవివా', 'ఛాయాచిత్రాలు' వంటి వైవిధ్య భరితమైన, హృద్యమైన, హృదయ విదారకమైన కవితలు ఇందులో దర్శనమిస్తాయి.

అమ్మ గురించి రాయని కవి ఉండడు. 'నాన్న' గురించి రాసిన వాళ్లు తక్కువ. 'నాన్న' కవితలో దిగంతాలకేగి, 'గోడ మీద ఫొటో'గా మిగిలిన నాన్న గురించి ఒక లేత మనసు పలవరింతను ఈ సంపుటిలో చూడవచ్చు.

'నాన్న కావాలంటే / నాన్న కావాలి/ నాకు నాన్న కావాలి
దమ్ము చేలో బురదలాంటి/ నాన్న స్పర్శ కావాలి
వేధించే/ పదిహేనేళ్ల పిలుపు లోటు/ పూరించుకోవాలి
నన్ను కన్న నాన్నను కనాలి.' అని పలవరిస్తాడు కవి.

ఇందులో తనదైన అనుభూతి ఉంది. ఆవేదన ఉంది. శ్రమైక జీవనపు అభివ్యక్తీ ఉంది. ఇంకా దీన్లో కొన్ని ప్రేమ కవితలున్నాయి. ఆవేదనా శకలాలున్నాయి. దుఃఖం తీరే తీరాల కోసం అన్వేషణ ఉంది. ఎంతో వస్తు విస్తృతి, కథనంలో వైవిధ్యం ఉన్న మంచి కవితా సంపుటి ఇది. ఇందులో మర్మాయవాల గొడవ, మార్మిక కవిత్వపు ముసుగూ కొంత ఉంది. పరిహరించవల్సిన అంశాల్ని కవి గ్రహించగలరు. దుఃఖం తర్వాత కళ్లు తేట పడతాయి. మనసు తెరిపిన పడుతుంది. దుఃఖాంతాన వచ్చే కొత్త కాంతేదో మనకు ద్యోతకమవుతుంది.

- జి.సుబ్బారావు

చూద్దామా

రా... రమ్మని పిలిచే రాజ ప్రాసాదాలు

రాజుల సంపద రాళ్ల పాలు అంటారు. అది నిజమే. ఎందుకంటే వారు ప్రజల్ని కొల్లగొట్టి సంపాదించిన సంపదంతా వారి విలాసాలకే కానీ ప్రజాసంక్షేమానికిఉపయోగపడలేదు. ఇయితే ఆ సంపదతో ఎన్నో అద్భుతమైన కట్టడాలు, రాజప్రాసాదాల నిర్మాణం చేపట్టారు. అవి వారి విలాసవంతమైన జీవితానికి, వారి కళాతృష్ణకు నిదర్శనం. ఈ రాజప్రాసాదాలు ఒక దేశంలోనే ఉన్నాయని చెప్పకోడానికి లేదు. దేశ దేశాల్లో ప్రపంచవ్యాప్తంగా ఉన్నాయి. వీటిని నిర్మించడంలో యూరోపియన్లది అందెవేసిన చెయ్యి. అందులోనూ జర్మనీ, జపాన్‌లో ఉన్న అద్భుతమైన కట్టడాల గురించి ప్రత్యేకంగా చెప్పకోవచ్చు. ముఖ్యంగా గోథిక్ శైలిలో నిర్మించిన కోటలు ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఉన్నాయి. ఇవి యునెస్కో సాంస్కృతిక సంపదలుగా, ప్రపంచ పర్యాటక కేంద్రాలుగా విరాజిల్లుతున్నాయి.

న్యూష్వన్ స్టెయిన్ ప్యాలెస్

అటువంటి ఐదు అపురూప కట్టడాల గురించి ఇవాళ చెప్పుకుందాం. ఇవి జపాన్, జర్మనీ, రొమేనియా, పోర్చుగల్ దేశాలలో వున్నాయి. అయితే 14వ శతాబ్దం నుంచి 19వ శతాబ్దం లోపు .... అంటే కొన్ని వందల ఏళ్ల కిందట నిర్మించిన ఆ కట్టడాలు నేటికీ సందర్శకులను కట్టిపడేస్తున్నాయంటే ఆశ్చర్యంగానే వుంటుంది. మరి ఆ వివరాలేంటో తెలుసుకోడానికి ఆలస్యమెందుకు!

న్యూష్వన్ స్టెయిన్ ప్యాలెస్

జర్మనీ టూరిజానికి కోట్ల రూపాయలను ఆర్జించిపెడుతున్న పర్యాటక కేంద్రాల్లో అగ్రస్థానంలో ఉన్న ప్యాలెస్ న్యూష్వన్ స్టెయిన్ ప్యాలెస్. దీన్ని న్యూ స్టోన్ ప్యాలెస్ అని కూడా పిలుస్తారు. బవేరియాలోని హోపే ష్వాంగాపూ సమీపంలోగల పర్వతంపైన అద్భుతంగా నిర్మించిన రాజమహల్ ఇది. దీని నిర్మాణం 1859వ సంవత్సరంలో జరిగింది. ఇప్పటిక్కూడా ఈ కోట చెక్కు చెదరలేదు. ఇప్పుడున్న బవేరియా ప్రాంతాన్ని 19వ శతాబ్దంలో లుడ్విగ్ - 2 అనే రాజు పాలించాడు. ఆయన ఈ కోటను తన అభిరుచికి తగ్గట్టు కట్టించుకున్నాడట. తన దగ్గర దాని నిర్మాణానికి సరిపడా డబ్బు లేకపోతే అప్పు చేసి మరీ కట్టించాడట. అప్పటి జర్మన్ డిజైనర్ క్రిస్టియన్ జంక్ ఈ కోటకు ప్లాన్ గీశారు. లుడ్విగ్ ఈ కోటకు 'న్యూ హోహెన్ ష్వాంగావూ' అని పేరు పెట్టాడు. అయితే ఆయన చనిపోయిన తర్వాత ఈ కోటను న్యూష్వన్ స్టెయిన్ క్యాజిల్‌గా పిలుస్తున్నారు. 1886లో లుడ్విగ్ మరణించే వరకు ఈ రాజప్రాసాదంలోకి ఎవ్వరినీ అనుమతించేవారు కాదట. లుడ్విగ్ కోట నిర్మాణానికి చేసిన అప్పు తీర్చడానికి ప్రజల సందర్శనార్థం ప్రస్తుతం దీన్ని తెరిచే ఉంచారు. ప్రతి సంవత్సరం ఈ కోటను 1.3 మిలియన్ల మంది సందర్శిస్తున్నారు. ఇప్పటి వరకు 50 మిలియన్లకు పైగా సందర్శించినట్లు అంచనా. వేసవిలో ఈ కోటను సందర్శించే వారి సంఖ్య రోజుకు ఆరువేల వరకు ఉంటుందట. దీనిని బట్టే జర్మనీ టూరిజంలో ఈ కోటకు ఉన్న పాపులారిటీని అర్థం చేసుకోవచ్చు. న్యూష్వన్ స్టెయిన్ ప్యాలెస్ గురించి అనేక సినిమాలు కూడా వచ్చాయి. 1923వ సంవత్సరంలో అప్పటి యువ రాజు రప్రెష్ట్ ఈ కోటను బవేరియా ప్రభుత్వానికి అప్పగించాడు. జర్మనీలో ఎక్కువ ఫొటోలు తీసిన ప్యాలెస్‌గా దీనికి గుర్తింపు ఉంది. కానీ కోట లోపల మాత్రం ఫొటోలు తీయడానికి అనుమతి లేదు.

మల్‌బోర్క్ కోట...

ప్రపంచంలో అరుదైన నిర్మాణశైలితో కట్టిన కోట ఇది. జర్మన్ రాజులు ఎంత విలాసంగా, వైభవంగా జీవితాన్ని గడిపారో చెప్పడానికి మల్‌బోర్క్ కోటని ఉదాహరణగా చెప్పొచ్చు. ఈ కోటని గోథిక్ శైలిలో ఇటుకలతో నిర్మించారు. 1274లో దీని నిర్మాణం జరిగింది. 52 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ కోట పర్యాటకులను ఇట్టే ఆకర్షిస్తుంది. నొగట్ నదీ తీరాన ఉన్న దీన్ని సందర్శించాలంటే పడవల్లో, ఓడల్లో రావాలి. నది ఒడ్డున ఉండడం వల్ల చుట్టూ ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుంది. ఇందులో మొత్తం మూడు భాగాలున్నాయి. చుట్టూ పచ్చని చెట్లతో ఎరుపు రంగులో చూడ ముచ్చటగా ఉంటుందీకోట. యూరప్‌లోనే అత్యంత పెద్దదైన ఈ కోటను



లోవెన్‌బర్గ్ ప్యాలెస్

మల్‌బోర్క్ కోట



హన్యాడ్ ప్యాలెస్



మట్సుమొటో ప్యాలెస్....

చాలాసార్లు పునర్నిర్మించారు. క్రూసేడుల్లో పతనమై మిగిలి ఉన్న వాటిలో చివరి కోట కూడా ఇదే. 1997లో యునెస్కో దీనిని ప్రపంచ వారసత్వ సాంస్కృతిక సంపదగా గుర్తించింది.

హన్యాడ్ ప్యాలెస్ ...

ప్రపంచంలోని పురాతన కట్టడాల్లో ఒకటి హన్యాడ్ ప్యాలెస్. ఇది ట్రాన్సిల్వేనియా హ్యునెడోరా (ప్రస్తుత రొమేనియా)లో ఉంది. దీని నిర్మాణం 14వ శతాబ్దంలో హున్యాడీ సామ్రాజ్య కాలంలో జరిగింది. నది ఒడ్డున ఉన్న పెద్ద రాయిపై దీన్ని నిర్మించారు. అప్పట్లో నిర్మించిన ఈ కోట గోథిక్ శైలిలో అద్భుతంగా ఉంటుంది. కానీ దీని ఏ వాస్తు ఎవరికీ అంతుబట్టకుండా ఉందట. 1446 – 53 మధ్య కాలంలో ఈ కోటను పునర్నిర్మించారు. 'వాలాచియా యువరాజు వ్లాడ్ -3' ఈ స్థలంలోనే బంధించబడి ఏడు సంవత్సరాల ఖైదు జీవితాన్ని గడిపాడట. చివరికి ఇక్కడే తుది శ్వాస విడిచాడట. అందమైన బాల్కనీలు, సువిశాలమైన తోటలతో కోటలోని వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. కాపిస్ట్రినో టవర్, నైట్‌హాల్, దివైట్, క్లబ్ టవర్ వంటి నిర్మాణాలు అద్భుతమైన ఆర్కిటెక్చర్‌కు నిదర్శనాలుగా నిలుస్తాయి.

లోవెన్‌బర్గ్ ప్యాలెస్...

జర్మనీలోని కస్సెల్ పట్టణ సమీపంలో ఉన్న ఈ కట్టడాన్ని మధ్యయుగం నాటిది. ఈ భవనాన్ని అప్పటి రాయల్ కోర్టు భవన ఇన్‌స్పెక్టర్ హిన్‌రిచ్ క్రిస్టోఫ్ జస్సో నిర్మించాడు. ఈయన ఆర్కిటెక్ట్‌గానే కాకుండా జర్మనీలో మంచి వాస్తు శిల్పి కూడా. ఫ్రాన్స్, ఇటలీ, ఇంగ్లండ్ దేశాల్లోని భవన నిర్మాణ రంగాల్లో ఇంజనీరుగా పనిచేశాడు. జర్మనీలోని గోథిక్ శైలిని అనుసరించే ఈ భవన నిర్మాణం జరిగింది.

మట్సుమొటో ప్యాలెస్....

కళ్ల చెదరగొట్టే రాజప్రాసాదాలు జర్మన్లకే సొంతం అనుకుంటే పొరపాటే. వాటికి ధీటుగా జపాన్‌లోనూ ఉన్నాయి. దీనికి ఉదాహరణే అద్భుతమైన కళాసంపదతో ఉన్న కోట మట్సుమొటో. ఇది నగానో ప్రెఫెక్చర్ రాష్ట్రంలో మట్సుమొటో నగరంలో ఉంది. ఆ దేశంలో ఉన్న వారసత్వ సంపదల్లో ముందుగా చెప్పుకోవాల్సింది మట్సుమొటో ప్యాలెల్ గురించే. రాజధాని టోక్యోకు చాలా దగ్గరలో ఉండడం వల్ల ఈ కోటని సందర్శించే వారి సంఖ్య ఎక్కువగానే ఉంటుంది. 16వ శతాబ్దంలో నిర్మాణం పూర్తి చేసుకున్న ఈ ప్యాలెస్ నిర్మాణంలో కలపను ఎక్కువగా ఉపయోగించారు. ఇందులోని ఫర్నిచర్, ఇంటీరియర్ డెకరేషన్ ప్రత్యేక ఆకర్షణ అనడంలో ఏమాత్రం సందేహం లేదు. మిగతా వాటిలా కాకుండా దీని నిర్మాణం మైదాన ప్రాంతంలో జరగడం మట్సుమొటో ప్రత్యేకత. 1872లో పునరుద్ధరణలో భాగంగా దీన్ని స్థలాన్ని వేలం వేశారు. అయితే ఈ సమయంలో మట్సుమొటోను కూల్చేస్తున్నారన్న విషయం బయటకు పొక్కడంలో లిచికవ రైజో అనే స్థానిక నాయకుడు భవనాన్ని రక్షించడానికి ఆందోళన చేపట్టాడు. దీంతో జపాన్ ప్రభుత్వం దిగివచ్చి ఈ అద్భుత నిర్మాణాన్ని స్వాధీనం చేసుకుంది.

పలాసియో గ పెన...

దీన్ని పెనా నేషనల్ ప్యాలెస్ అని కూడా పిలుస్తారు. ఈ అద్భుత నిర్మాణం పోర్చుగల్‌లోని సింట్రా నగరంలో సావో పెడ్రో డి పెనాఫెరిమ్ అనే నగరంలో ఉంది. పోర్చుగల్‌లో జరిగిన ఉద్యమాలకు స్ఫూర్తిగా 18వ శతాబ్దంలో ఈ కోట నిర్మాణం జరిగింది. కొండపై నిర్మించడం వల్ల ఈ కట్ట లిస్బన్ నగరం నుండి కూడా కనిపిస్తుంది. పెనా నేషనల్ ప్యాలెస్ యునెస్కో సాంస్కృతిక సంపదగా కూడా గుర్తింపు పొందింది. పోర్చుగల్‌లోని ఏడు వింతల్లో ఈ ప్యాలెస్ ఒకటి.

ఇవే కాకుండా స్లోవేనియాలోని ప్రెడ్జమా ప్యాలెస్, ఫ్రాన్స్‌లోని మోంట్ సెయింట్ మిచెల్, దలైలామా రాజప్రాసాదమైన లాసా లాంటి అనేక చారిత్రక రాజప్రాసాదాలు ఇప్పటికీ చెక్కు చెదరకుండా పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

★



పలాసియో గ పెన ప్యాలెస్

అట్టమీది కథ

సైన్స్‌దే అంతిమ విజయం



“సత్యశోధజేసి, జ్ఞానపరిధి పెంచి
పరిసరాలపైన ప్రభుత గూర్చి
సైన్సు నరుని సకల జగదీశుజేసెరా
నవయుగాల బాట, నార్ల మాట” అన్నారు నార్లవారు.

నిజమే! సైన్సు నరుణ్ణి అన్ని జీవులకూ అధీశ్వరుణ్ణి చేసింది. మానవ జీవితం, ప్రగతి అన్నీ సైన్సు ఫలితాలే. అందుకే నార్లవారు ‘కుమ్మరి పనిలోన, కమ్మరి పనిలోన ఎంచి చూడ సైన్సు ఎందు లేదు?” అని ప్రశ్నించారు. ఆనాటి కుమ్మరి, కమ్మరి వృత్తులలోనే కాదు నేటి కంప్యూటర్ గ్రాఫిక్స్ వరకూ నిండి ఉన్నది సైన్సే. సైన్సు అభివృద్ధి కారణంగానే మానవుడు గుండెకు గుండెను మార్చుతున్నాడు. ఆకాశంలో షికారు చేస్తున్నాడు. మరో దేశంలో ఉన్న మనవడితో ముఖాముఖి మాట్లాడుతున్నాడు. గాలిని కూడా కండిషన్లో ఉంచుతున్నాడు. ఈ ప్రగతి, సౌకర్యాలు, విలాసాలు లక్షలాది మంది శాస్త్రజ్ఞుల కఠోరశ్రమ ఫలితమే. ఎవరైతే సైన్సు ఫలాలను అనుభవిస్తున్నారో, వారు ఆ సౌకర్యాలను కోట్లాది మందికి అందకుండా అడ్డుకుంటున్నారు. ఒకపక్క విజ్ఞానశాస్త్రాలను వారు ఉపయోగించుకుంటూనే, మరోపక్క ప్రజలను అజ్ఞానంలో ముంచెత్తుతున్నారు. ఇది మరింత ప్రమాదకరమైన విషయం. విజ్ఞాన శాస్త్ర ఫలితంగా రూపొందిన టీవీలను ఉపయోగించుకొంటూ దయ్యాలూ, మహిమలూ ఉన్నాయంటూ ప్రజల మనస్సులలో అజ్ఞాన బీజాలు నాటుతున్నారు. ఈ తరహా ప్రచారం, గత 20 ఏళ్ళగా ప్రణాళికాబద్ధంగా జరుగుతోంది. ఆ ప్రచారం కారణంగా వేషభాషలలో మాత్రమే ఆధునికత గల్గి, ఆలోచనలలో మధ్యయుగాల నాటికి మరలిన ఒక కొత్త తరం ఉద్భవించింది. అది రోజురోజుకూ పెరుగుతోంది. ఎందుకిలా జరుగుతోంది? దీనికి కారణమేమిటి? శాస్త్ర విజ్ఞాన ప్రచారం ద్వారా ప్రజల అజ్ఞానాన్ని రూపుమాపాలని కోరుకునే దేశభక్తులందరూ సైన్స్‌డే సందర్భంగా వేసుకోవలసిన ప్రశ్నలివి? వీటికి సమాధానాలను వివరంగా పరిశీలిద్దాం.

\- కె.ఎల్.కాంతారావు

సైన్సు ప్రచారం కోసం జనవిజ్ఞాన వేదిక కార్యకర్తలు స్కూళ్ళకు వెళ్ళిన సందర్భంగా, పిల్లలను “దయ్యాలున్నాయా?” అని ప్రశ్నించినపుడు పిల్లలందరూ “ఉన్నాయి” అనే సమాధానం చెప్పారు. “ఎందుకు అట్లా నమ్ముతున్నారు?” అని ప్రశ్నిస్తే వారందరి సమాధానం ఏమిటో తెలుసా? “టీవీల్లో చూపిస్తున్నారు గదా!” అని. ఇల్యూజన్, డెల్యూజన్, హాల్యూసినేషన్ల కారణంగా భ్రమ, భ్రాంతి కలిగిన వ్యక్తులు తమకెదురుగా ఎవరో కన్పిస్తున్నట్లు, ఏవేవో విన్పిస్తున్నట్లు అనుభూతులు చెందుతుంటారనీ, వాటినే దయ్యాలుగా భావిస్తారని సైన్సు రుజువు చేసింది. ఆ తర్వాత కూడా దయ్యాలను గూర్చి అత్యాధునిక వైజ్ఞానిక ప్రసారసాధనాల ద్వారా ప్రచారం చేయడం, గ్రాఫిక్స్ ఉపయోగించి అరుంధతి, మగధీర వంటి సినిమాలలో పునర్జన్మ కథలు చూపించడమంటే సాంకేతిక విజ్ఞానం ద్వారా మూఢనమ్మకాలను ప్రచారం చేయడమే.

దాదాపు 15 ఏళ్ల కిందటి మాట. మా గ్రామంతో సహా అనేక వేల గ్రామాల్లో వాస్తు పేరు మీద ఆస్తులు పోగొట్టుకోవడం మొదలైంది. వాస్తు బాగాలేదని ఎవరో చెప్తే అమాయకులు అనేకమంది తమ ఇళ్లను కూలగొట్టుకున్నారు. పక్క వాడి బావి తన ఇంటికి వాస్తు దోషం కలిగిస్తుందని “వాస్తు సిద్ధాంతి” చెప్పగానే దౌర్జన్యంతో ఆ బావిని పూడ్చేసి తగాదాలు తెచ్చుకున్నారు. అలాగే జ్యోతిష్యం పేరుతో ‘వధూవరుల జాతకాలు కలవలేదని సిద్ధాంతి చెబితే బంగారం లాంటి సంబంధాలు వదులుకున్నారు. చేతబడి చేశాడని

అనుమానమొస్తే అప్పటి వరకూ పై రెండు పళ్ల పీకేసేవారు. అయితే అలాంటి అనుమానితులపై హత్యలు కూడా అప్పుడే ప్రారంభమయ్యాయి.

ఈ సమయంలో వాస్తు గ్రంథాలు తిరగేస్తే ఆకర్షణీయమైన అంశాలు కనిపించాయి. 1. ఈశాన్య మూలన పొయ్యి ఉండకూడదు. అలా వుంటే ఆ ఇంట్లోని కనకమంతా కట్టెలాగా కాలిపోయి ఆ ఇంటి యజమాని దరిద్రుడవుతాడు. 2. ఇంటికి దక్షిణం వైపు కంటే ఉత్తరం వైపు ఎక్కువ ఖాళీ స్థలం ఉండాలి. అలాకాక ఉత్తరం కన్నా దక్షిణంలో ఎక్కువ ఖాళీ స్థలం ఉంటే అన్ని అనర్థాలకు మూలం అవుతుంది అని గౌరు తిరుపతి రెడ్డి చెప్పారు. ఈ రెండు అంశాలు నన్నెందుకు ఆకర్షించాయంటే కొప్పెరపాడు గ్రామంలోని మా ఇంట్లో ఈశాన్య మూలన పొయ్యి వుంది. వెంటనే ఆ రెండు విషయాలను మా అమ్మకు వివరించి, "నలభై ఏళ్ల కిందట ఆ ఇంటిని కొనేటప్పుడు నువ్వు గానీ, నాన్న గానీ, ఇతర పెద్దలు గానీ వాస్తును పరిశీలించలేదా?" అనడిగాను. వెంటనే "ఏమోరా! మేము ఈ ఇంటి వాస్తును గూర్చి ఎప్పుడూ ఆలోచించలేదు. ఇప్పుడు మనకేమయింది? మేము గానీ, నువ్వు గానీ, నీ తమ్ముడు గానీ డబ్బుకేం ఇబ్బంది పడడం లేదుకదా? ముసలమ్మ చనిపోవడం తప్పితే ఏ అనర్థాలూ మన ఇంట్లో వాళ్లకు జరగలేదు కదా?" అంది శాంతంగా. వెంటనే మరో ప్రశ్న వేశాను. "మా నలుగురి పెళ్లిళ్ల విషయంలో ఎవ్వరికీ జాతకాలు చూడలేదు. ఇప్పుడు జాతకాలు కలిశాయని సిద్ధాంతి చెప్పిన తర్వాత గానీ పెళ్లి చూపులు ఏర్పాటు చేయడం లేదుకదా? అప్పుడలా ఎందుకు చేశారు?" అడిగాను. అప్పుడు మా అమ్మ "మీ పెళ్ళిళ్లే కాదురా. మా పెళ్లిళ్ల సమయంలో కూడా మా నాన్న ఎవరి జాతకాలు అడగలేదు. ఎందుకో గానీ ఇప్పుడు వాస్తు చాదస్తం, జాతకాల పిచ్చి ఎక్కువైందిరా!" అంది.

"నిజమే! గత ఇరవై ఏళ్ల నుండి క్రమక్రమంగా అనేక మూఢనమ్మకాలు పెరిగిపోతున్నాయి. చివరకు విజ్ఞానశాస్త్రాలు బోధించే ఆచార్యుల్లో కూడా ఇవి పెరిగాయి. పెరుగుతున్నాయి. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో పనిచేసే ఒక శాస్త్రజ్ఞుని మాటల్లో చెప్పాలంటే "మాలో చాలామందికి ద్వంద్వ వ్యక్తిత్వం ఉంది. శాస్త్రజ్ఞులుగా పరిశోధనల్లో హేతుబద్ధంగా మాత్రమే ఆలోచిస్తాం. పని చేస్తాం. కానీ మేము లాబొరేటరీ నుండి ఇళ్లకు వెళ్లిన తర్వాత దానికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తాం (ది గాడ్ మార్కెట్, 72వ పేజీ). దీనికి రుజువేంటంటే "తమ బాధలు తీరడం కోసం నరబలి ఇవ్వబోయి ఆయుధాలతో సహా పోలీసులకు ఇద్దరు సీనియర్ శాస్త్రవేత్తలు దొరికిపోయారనే" వార్త (ఆంధ్రజ్యోతి 13.10.09).

దురదృష్టవశాత్తు ఇలాంటి శాస్త్రవేత్తలు కూడా తగ్గిపోయి, ప్రయోగశాలల్లోనూ, పనిస్థలాల్లో కూడా హేతువిరుద్ధంగా ప్రవర్తించే వారు ఎక్కువయ్యారు. కొన్ని ఉదాహరణలు పరిశీలిద్దాం.

కర్నాటకలో ఒక థర్మల్ విద్యుదుత్పత్తి కేంద్రంలో కొన్ని యూనిట్లలో కొన్ని కారణాల వల్ల విద్యుదుత్పత్తి తగ్గిపోయింది. అప్పుడు ఆ కేంద్రంలోని సీనియర్ సాంకేతిక నిపుణులు కొందరు మహత్యాలు కలిగిన స్వాములను సంప్రదించారు. వారు ఆ కేంద్రాన్ని బాగా పరిశోధించి కేంద్రం చుట్టూ రాతితీగతో కంచెను ఏర్పాటు చేయమని సలహా ఇచ్చారు. ఆ సలహా అమలైంది. పరిస్థితిలో ఏ మార్పు లేదు (ఎన్.సి.ఎస్.టి.సి. కమ్యూనికేషన్స్, జులై 2002).

విచిత్రమేమంటే స్వాముల సలహాకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి మొదటి పేజీలో ఆ వార్తను ప్రచురించిన పెద్ద పెద్ద పత్రికలు, ఆ సలహాలోని అశాస్త్రీయతను ప్రశ్నించనూ లేదు. పరిస్థితిలో మార్పు రాకపోవడాన్ని ఒక వార్తగా ప్రచురించనూ లేదు.

హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయంలో పరిపాలనలో ఎదురౌతున్న ఇబ్బందులకు పరిష్కారంగా ఆ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ల ఆధ్వర్యంలో పరిపాలనా భవనం నాలుగు వైపులా నాలుగు మేకలను బలివ్వడం జరిగింది (ఈనాడు 16.10.94).

శ్రీహరికోట రాకెట్ ప్రయోగ కేంద్రంలో రాకెట్ ప్రయోగించే ప్రతిసారీ, ఆ రాకెట్ నమూనా తీసుకువెళ్లి తిరుమల వెంకటేశ్వరుని దగ్గరా ఆ గ్రామ దేవత చెంగాలమ్మ దగ్గరా, రాకెట్ కేంద్రంలోని సీనియర్ శాస్త్రజ్ఞులు పూజలు నిర్వహించడం ప్రతిసారీ అందరం గమనిస్తూనే ఉన్నాం. ఆ పూజల నిర్వహణ ఆ శాస్త్రజ్ఞులలోని ఆత్మవిశ్వాస రాహిత్యాన్నే కాక, తాము చదివిన విజ్ఞానశాస్త్రం మీద వాళ్ల అపనమ్మకాన్నే సూచిస్తుంది.

ఈ సందర్భంగా ఓ వాస్తవ సంఘటనను తప్పక ప్రస్తావించుకోవాలి. గొప్ప మనస్తత్వ శాస్త్రవేత్తగా పేరు సంపాదించిన డా॥అబ్రహం.టి. కోవూర్‌కి చిన్నతనంలో జ్వరం వచ్చింది. అప్పుడు ఆయన తల్లి ఒక మాత్ర ఇచ్చి "దేవుణ్ణి తలుచుకుని మాత్ర వేసుకో. నీ జ్వరం తగ్గిపోతుంది" అంది. వెంటనే బాల కోవూర్ "అమ్మా! దేవుణ్ణి తలచుకుంటేనే జ్వరం తగ్గుతుందా? లేక మాత్ర వేసుకుంటే జ్వరం తగ్గుతుందా?" అనడిగాడు. ఆయన తల్లి "అదేం ప్రశ్న నాయనా?" అంది. దానికి బాల కోవూర్ "దేవుణ్ణి తలచుకుంటే జ్వరం తగ్గుతుందంటే ఆయన్ను తలుచుకుని మాత్ర పారేస్తాను. మాత్ర వేసుకుంటే తగ్గుతుందంటే దేవుణ్ణి తలుచుకోకుండా మాత్ర వేసుకుంటాను" అని సామాధానమిచ్చాడు. తల్లి ఆయన ప్రశ్నకు సమాధానమీయలేకపోయింది. పదేళ్ల పిల్లవాడికి వచ్చిన హేతుబద్ధమైన ఆలోచన పెద్ద శాస్త్రజ్ఞులకు రాకపోవడం వారి అశాస్త్రీయ ఆలోచనా ప్రవంతికి ఒక గొప్ప ఉదాహరణ.

మూఢనమ్మకాలు ఎందుకు పెరిగిపోతున్నాయ్!

ఇలా అశాస్త్రీయ ఆలోచనా ధోరణి, మూఢనమ్మకాలు గత 20 ఏళ్లుగా ఎందుకు

విపరీతంగా పెరిగాయి. దీనికి ప్రధాన కారణమేమిటి? పరిశీలిద్దాం. దీనికి ప్రధాన కారణం ప్రయివేటీకరణ! మరి ప్రయివేటీకరణకు, ప్రజల్లో మూఢనమ్మకాలు పెరగడానికీ సంబంధమేంటి?

1990ల వరకూ చదువుకున్నవారిలో ఎక్కువమందికి ప్రభుత్వోద్యోగాలు దొరికేవి. 90లలో ప్రయివేటీకరణ మొదలైంది. ఇది అనేక పద్ధతుల్లో సాగుతోంది. ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా ప్రయివేటు యజమానులకు అమ్మడం (ఉదా: 5500 కోట్ల రూపాయల స్థిర చరాస్తులు కల్గిన "బాల్కో" అనే ప్రభుత్వ రంగ సంస్థను "స్టెరిలైట్" అనే ప్రయివేటు సంస్థకు 551 కోట్ల రూపాయలకు బిజెపి నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమ్మివేసింది (ప్రజాశక్తి 10.4.01).

మిగిలిన ప్రభుత్వ రంగ సంస్థల్లో కాంట్రాక్టు పద్ధతిలో మాత్రమే ఇంజనీర్లు, డాక్టర్లు, లెక్చరర్లు, ప్రొఫెసర్లతో సహా ఉద్యోగులను అలాగే కార్మికులను తీసుకోవడం. ఉదా: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల్లో పర్మినెంటు ఉద్యోగులు 1990 -91లో 12 లక్షల మంది ఉండగా, 2010-11లో వారు 5 లక్షలమందే ఉన్నారు. మిగిలిన వారంతా కాంట్రాక్టు ఉద్యోగులు, కార్మికులే.

ప్రయివేటు యాజమాన్యాలకు లక్షల కోట్ల రూపాయల రాయితీలు ఇచ్చి పరిశ్రమలు స్థాపించుకోడానికి వారిని ప్రోత్సహించడం. 2010 - 11 బడ్జెట్‌లో ముఖేష్ అంబానీకి 40వేల కోట్ల రాయితీలను కేంద్ర యు.పి.ఎ. ప్రభుత్వం ఇచ్చిందనీ, ఆ అంశాన్ని బి.జె.పి నాయకులెవ్వరూ పార్లమెంటులో ప్రస్తావించకుండా వారిని "ఎడ్యుకేట్" చేయడం జరిగిందనీ మీరా రాడియా టేపుల ఉదంతంతో దేశ ప్రజలకు తెలిసింది.

ఈ ప్రకారంగా నూతన ఆర్థిక విధానాలు, లేదా ఉదారవాద విధానాలు ప్రయివేటీకరణ గ్లోబలీకరణల పేరుతో ప్రభుత్వ ఉద్యోగులను సంవత్సరానికి 1.9 శాతం చొప్పున తగ్గిస్తూ (ఇది సాక్షాత్తూ మాజీ ప్రధానమంత్రి ఎ.బి.వాజ్‌పేయి అన్నమాట) దాదాపు అదే స్థాయిలో ప్రయివేటు ఉద్యోగులను, కార్మికులను పెంచడం జరుగుతోంది.

అందువల్ల ఒక పక్క శతకోటీశ్వరుల సంఖ్య పెరుగుతోంది. మరోపక్క నిరుద్యోగం, చిరుద్యోగం, దారిద్ర్యం పెరుగుతున్నాయి. దీనికి సంబంధించి వాస్తవిక గణాంకాలను పరిశీలిద్దాం. భారతదేశంలో శతకోటీశ్వరులు 2004లో 9 మంది మాత్రమే. కానీ 2008 నాటికి వారి సంఖ్య 53కు పెరిగింది (ఫోర్బ్స్ ప్రకటించిన జాబితా ప్రకారం). అయితే ఐక్యరాజ్య సమితి ప్రకటించిన మానవాభివృద్ధి సూచికల ప్రకారం మొత్తం సేకరించిన 177 దేశాల పట్టికలో భారతదేశం 2000 సంవత్సరంలో 124వ స్థానం నుండి 2007 నాటికి 128వ స్థానానికి పడిపోయింది. మన పొరుగుదేశమైన చైనా 2000 సంవత్సరంలో 99వ స్థానంలో ఉంది. 2007 నాటికి 81వ స్థానానికి ఎగబాకింది. ఆసక్తికరమైన విషయమేమిటంటే ఇండియా, మానవాభివృద్ధి సూచికలో 2007లో ఉన్న 128వ స్థానం నుండి 2008లో 132వ స్థానానికి దిగజారింది. అంటే ఉద్యోగావకాశాలు, ఆకలి, అవిద్య, మూఢనమ్మకాలు మన దేశంలో క్రమంగా పెరుగుతున్నాయన్నమాట. ప్రయివేటు రంగంలోని చిరుద్యోగులతో బాటు, అదే రంగంలోని పెద్ద ఉద్యోగులకు కూడా ప్రభుత్వ రంగంలో ఉన్నట్లుగా ఖచ్చితమైన పని గంటలు గానీ, ఉద్యోగ భద్రత గానీ వుండవు. వారిని హైర్ (ఉద్యోగం ఇవ్వడం) చేసిన వ్యక్తి, వారిపైకి సిద్ధం చేసిన ఫైర్ (అకస్మాత్తుగా ఉద్యోగం నుండి తీసివేయడం) అనే కత్తిని వేలాడదీసి ఉంచడం జరుగుతోంది.

విషపు వలలు

ఈ పరిస్థితి వారిలో తీవ్రమైన ఆందోళన కలిగిస్తుంది. వారిని తీవ్రమైన మానసిక అశాంతికి గురిచేస్తుంది. ఇది ఉద్యోగులకు, నిరుద్యోగులకు వర్తిస్తుందని ఏలికలకు ముందే తెలుసు. పరిశ్రమలన్నీ ప్రభుత్వ రంగంలోనే ఉండాలని కోరుకునే కమ్యూనిస్టులు దీనికి మినహాయింపు. కోట్లాదిమంది ఉద్యోగుల్లో, నిరుద్యోగుల్లో అశాంతి, ఆందోళన, అసంతృప్తి పెరిగి తమలోని అభద్రతకు, అతి చాకిరీకి కారణం తమ పాలకులే అనే విషయం వారు తెలుసుకుంటారని కూడా పాలక వర్గాల వారు గుర్తించారు. అందువల్ల వారిలోని అసంతృప్తిని దారి మళ్లించడానికి 1990లలోనే అనేక విషపువలలు ప్రజలపై విసరడం మొదలుపెట్టారు. వాటిని ఒక్కొక్కటిగా పరిశీలిద్దాం.

మొదటి విషపువల

"మానవుల కష్టాలు, కన్నీళ్లు, బాధలు, మానసిక అశాంతి మొదలైన వాటికి కారణమూ, నివారణ శక్తీ రెండూ భగవంతుని వద్దే ఉన్నాయి. అంతేకాని దానికి కారణం పరిశ్రమల యజమానులూ కాదు, భూస్వాములు అంతకంటే కాదు. బాధా నివారణ కోసం, అశాంతిని తొలగించుకోవడం కోసం భగవంతుని ప్రార్థించండి. ధనవంతుల మీద అసూయ, మాత్సర్యం పెంచుకోకండి. అసలు కారణాన్ని గ్రహించక, ధనికులపై పగను, ద్వేషాన్ని పెంచుకుని ఏదైనా పాపకార్యం చేస్తే ఈ జన్మలోనే కాదు, వచ్చే జన్మలో కూడా కుక్క, నక్క, పురుగుల్లాగ జన్మనెత్తి మరిన్ని బాధలను అనుభవిస్తారు" అని తమ మేధోసేవకులైన అమ్మలు, బాబాలు, స్వాముల ద్వారా సభల్లో ఉపన్యాసాలు చేయిస్తున్నారు. టీవీ ఛానళ్లలో దాదాపు 99 శాతం తమ వర్గ ప్రయోజనాలు కాపాడే టెలివిజన్ ఛానళ్లే కాబట్టి వాటి ద్వారా స్వాముల సందేశాలూ, అమ్మల ఆశీస్సులు ఇప్పిస్తుంటారు. ప్రజల్లో దైవభక్తి పెరగటం కోసం లక్షలాది దేవాలయాలు నిర్మిస్తున్నారు. పాతవాటిని బాగుచేయిస్తున్నారు. అందుకోసం వందల కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నారు. అందుకు అనేక రుజువులు మన కళ్ల ముందే వున్నాయి.

భారతదేశంలో 2009 నాటికి హిందూ ఆలయాలు, మసీదులు, చర్చీలు, గురుద్వారాలు అన్నీ కలిసి 25 లక్షలు ఉన్నాయి. కానీ అన్ని రకాల విద్యాలయాలు కలిసి 15 లక్షలే ఉన్నాయి. ఆసుపత్రుల సంఖ్య 75 వేలు మాత్రమే (బీయింగ్ ఇండియన్, రచన: పవన్‌వర్మ పేజీ 96).

2001లో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి), బిజెపి నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వ సహకారంతో, సుప్రీం కోర్టు ఆశీస్సులతో కాలేజీల్లో

జ్యోతిష్యం (ఈ మార్మికకళకు 'జ్యోతిర్ విజ్ఞాన్' అనే పేరును యుజిసి పెట్టింది)'. పౌరోహిత్య కోర్సులను ప్రవేశపెట్టింది. ఈకోర్సులను బోధించే విద్యా సంస్థలకు డీమ్డ్ యూనివర్శిటీల హోదానిచ్చింది. ఆ సంస్థలకు ప్రభుత్వ గ్రాంట్లు విస్తారంగా అందుతాయి కానీ సిలబస్‌ను ఆదేశించే అధికారం మాత్రం ప్రభుత్వానికి లేదు. ఉదాహరణకు మధ్య ప్రదేశ్‌లోని నవీ మండల్, వేద విద్యామందిర్‌లో సంవత్సరానికి 80 మంది విద్యార్థులు శిక్షణ పొంది బయటికి వస్తారు (ద టైమ్స్ ఆఫ్ ఇండియా 5.9.2005).

తమిళనాడులో 22 పురోహిత శిక్షణా విద్యా సంస్థలకు ప్రభుత్వం సంవత్సరానికి మూడు కోట్ల గ్రాంటు విడుదల చేస్తోంది. (తమిళనాడు ప్రభుత్వ వెబ్‌సైట్ www.tn.gov.in)

గుజరాత్ ప్రభుత్వం, పోరుబందర్ ఎయిర్‌పోర్టుకు దగ్గర్లోని 85 ఎకరాల స్థలాన్ని శ్రీ భారతీయ సంస్కృతీ సంవర్ధక ట్రస్టుకు ఉదారంగా బహూకరించింది. ఆ ట్రస్టు ఆ ప్రదేశంలో ఒక పూజారి శిక్షణా పాఠశాలను నెలకొల్పింది [http//www.sandipani.org/trusts/index.asp]. బాబా రామ్‌దేవ్‌కు మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్, జార్ఖండ్ ప్రభుత్వాలు డీమ్డ్ యూనివర్శిటీలు స్థాపించుకోడానికి వందలాది ఎకరాలు బహుమతిగా అందజేయడమే కాక, ఆ యూనివర్శిటీల జీవితకాల వైస్‌ఛాన్సలర్‌గా బాబా రామ్‌దేవ్‌ను నియమించాయి (ది హిందూ 16.2007, http//www.medindia.net, The organiser 23.4.2006].

అన్నింటికంటే బాధాకరమైన విషయం ఢిల్లీలో అక్షరధామ్ దేవాలయ నిర్మాణానికి 100 ఎకరాలు బహూకరించిన విషయం. ఆ దేవాలయ నిర్మాణం కోసం బిజెపి నాయకత్వంలోని ప్రభుత్వం 30 ఎకరాల్లో నివసిస్తున్న వేలాదిమంది మురికివాడల ప్రజల్ని తరిమి కొట్టింది. ఢిల్లీ మాస్టర్ ప్లాను ను సవరించింది. యమునా నదీ ప్రవాహ దిశను మళ్లించింది. పర్యావరణ సూత్రాలను ఉల్లంఘించింది (టైమ్స్ ఆఫ్ ఇండియా 4.5.2000, తెహెల్కా 7.10.2006). ఈ దేవాలయ నిర్మాణ అనుమతుల కోసం, తన అనుచరులను పురిపకొల్పుతూ 'స్వామి నారాయణ సంస్థ' నాయకుడు యోగీజీ మహరాజ్ రాసిన లేఖలో ఇలా పేర్కొన్నారు. 'భగవంతుడు తనదైన దైవిక మార్గంలో ఈ కోరికను తీరుస్తాడు'. [http//www.swamy narayan.org/news/2000/11/index.htm]. ఆహా! వేలాదిమంది పేదల గుడిసెలు పీకివేయడం దైవిక మార్గమట! ఢిల్లీ మాస్టర్ ప్లానును మార్చి వేయడం, పర్యావరణ ప్రమాదాలను



లెక్కచేయకపోవడం ఇవన్నీ దైవిక మార్గాలేనట. వీరిని ఎలా అర్థం చేసుకోవాలి?

రెండవ విషపు వల

సైన్సు విజ్ఞానం పెరిగితే ఆమేరకు చైతన్యం పెరుగుతుంది. కాబట్టి విజ్ఞాన శాస్త్రంలో అతి ముఖ్యమైన, అత్యంత ప్రభావాన్ని కలిగించే డార్విన్ పరిణామవాదాన్ని హైస్కూల్ స్థాయి సిలబస్ నుండి తీసివేయడం జరిగింది. రెండో పక్క జ్యోతిష్యం, వాస్తు వంటి మార్మిక అంశాలను సైన్సు పేరు మీద ప్రవేశపెట్టి వాటిలో డిగ్రీలు, పోస్టు గ్రాడ్యుయేషన్లు, డాక్టరేట్లు ఇస్తున్నారు. ఇంట్లో ఏ మూల మంట, పంట, గుంట ఉంటే ఆ యజమానికి లాభనష్టాలు ఎలా ఉంటాయో తెలియజెప్పే సైన్సు పట్టభద్రులు తయారయ్యారు. ఒక మూల వంటకు, మరో మూల గుంటకు మన జీవితాలను శాసించే శక్తి ఎలా వస్తుందో తెలియజెప్పగల పట్టభద్రులు, మన జీవితాలను రౌడీలు, అవినీతిపరులు, కుటిల రాజకీయవాదులు మాత్రమే శాసిస్తున్నారని తెలుసుకోలేక పోతున్నారు. ఇతరులకు వివరించలేకపోతున్నారు. దానివల్ల ఇళ్లు, వాకిళ్లు కూలగొట్టించుకునే పనిలో ప్రజలు పడిపోయి తమ కష్టాలకు అసలు కారకుడైన శత్రువును ఆదరంగా, ఆప్యాయంగా, అభిమానంతో ఆశీర్వదిస్తున్నారు.

మూడవ విషపు వల

కులం, మతం అనేవి మానవజాతి చరిత్రలో ఇటీవల చేరిన అంశాలని చారిత్రక పరిశోధనకులూ, జీవశాస్త్రజ్ఞులు రుజువు చేశారు. కానీ ఆ రెండూ భారతీయ సమాజాన్ని పట్టి పీడిస్తున్న భయంకర మూఢనమ్మకాలు. దేశానికి పట్టిన చీడపురుగులు. వాటిని ప్రజల మనస్సుల్లో నుండి తొలగించడానికి కృషి చేయాల్సి ఉండగా, కుల సంఘాల స్థాపన ద్వారా కులాల వారీ వనభోజనాల ద్వారా మతోన్మాద చర్యల ద్వారా ఇటీవలి కాలంలో ప్రజల్లోని సమైక్య భావనను దెబ్బతీయడం జరుగుతోంది. ప్రయివేటీకరణ కారణంగా బ్రతుకులు నాశనమైన వారందరూ ఒకటైతే తమ ఉనికికే ప్రమాదమని అర్థం చేసుకున్న నాయకులు, ప్రయివేటీకరణతో పాటే "విభజన" రాజకీయాలు కూడా మొదలెట్టారు. కుల సంఘాలతో తప్పు ఏమిటి? అని ఒక నాయకుడు, మనమంతా హిందువులం, మనం మాత్రమే బంధువులం అని మరో రాజకీయ నాయకుడూ గొంతు చించుకుని అరవడం మనం గమనిస్తున్నాం. అందుకే ఈనాడు కులాల గోడలు కూలిపోయి మతాల మౌఢ్యం మసికావలసి ఉండగా విచిత్రంగా, రాజకీయ నాయకులతో సహా పేరు చివర తమ కులం పేరును తగిలించుకోవడం ఒక గొప్ప విషయంగా పరిగణిస్తున్నారు. ఇది ప్రయివేటీకరణ ప్రభావం కాక మరేమిటి?

సూర్యోదయంతో చీకట్లు మాయమైపోయినట్లుగా శాస్త్రసాంకేతిక విజ్ఞానం పెరిగే కొద్దీ మూఢనమ్మకాలు అంతరించాలి. కానీ పాలకపక్షాలు, వాటి ఆర్థిక రాజకీయ విధానాలు మూఢత్వం కొనసాగించడానికే కారణమౌతున్నాయి. తరతరాల సామాజిక నేపథ్యం మూలంగా శాస్త్రజ్ఞానం గడించినవారుకూడా మూఢత్వానికి లోనుకావడం ఒక సాంఘిక వైపరీత్యం. ఎవరు అండగా నిల్చినా, ఎవరు ఆదరించినా మూఢత్వం ప్రగతికి ప్రతిబంధకం. కనుకనే దానిపై శాస్త్రవిజ్ఞాన ప్రచారంతోపాటు మూఢత్వాన్ని పారదోలే ప్రయత్నాన్ని కూడా నిరంతరాయంగా సాగిస్తుండాలి. చరిత్రకందినంత వరకు అనాది కాలం నుండి పాలక వర్గాలు మూఢనమ్మకాలను ప్రచారం చేస్తూనే ఉన్నాయి. శాస్త్రవిజ్ఞానం పెరిగే కొద్దీ అవి పటాపంచలై పోతూనే ఉన్నాయి. ఇటీవల (2010 జనవరిలో) వచ్చిన సూర్యగ్రహణాన్ని సాధువులతో సహా కోట్లాది మంది ప్రజలు ప్రత్యేకమైన కళ్లజోళ్ల సహాయంతో చూడడం, గ్రహణం సమయంలో లక్షలాది మంది "సూర్య భోజనాలు" చేయడం మూఢనమ్మకాలపై శాస్త్ర విజ్ఞానం సాధించిన విజయాలకు తాజా ఉదాహరణ. కాబట్టి జాతీయ సైన్సు దినోత్సవం (ఫిబ్రవరి 28) సందర్భంగా మనమందరం అజ్ఞానంపై అంతిమ విజయం విజ్ఞానానిదేనని గ్రహించి ముందుకు సాగుదాం. మన బాధలకు, కష్టాలకు, కన్నీళ్లకు కారణం ప్రయివేటీకరణ జపంతో స్వదేశీయులను దోచుకుని స్విస్ బ్యాంకుల్లో దాచుకునే కుటిల రాజకీయ నాయకులేనని గ్రహిద్దాం. మనం భారతీయులం, మనమంతా బంధువులం అనే భావనతో ఐకమత్యంతో విచ్ఛిన్న వాదులను ఎదిరిద్దాం. అన్నార్తులు, అభాగ్యులుండని ఆ "నవ యుగం" కోసం కలలు కందామని, ఆ కలలను సాఫల్యం చేసుకుందామని సైన్స్ డే సందర్భంగా ప్రతిన బూనుదాం. ★

చిగురు

- తెలకపల్లి రవి

మూడోసారి గడియారం చూసుకున్నాను. పది కావస్తుంది. ఇప్పుడు ఇంటికెళ్లి హడావుడిగా తయారై బస్టాండు చేరడానికి కనీసం ముప్పావు గంట కావాలి. పదకొండుకు బస్సు. అయినా వెంటనే బయలు దేరవు గనక మరో పావు గంట వేసుకుంటే పదకొండుంపావు... అలా అనుకుంటే కాస్త ఉపశమనం. ఉద్రిక్తోపశమనం.. టైం గొంతు మీదకు వచ్చేదాకా వుండడమెందుకు? ఆపైన టెన్షన్ పడటమెందుకు?... ఈ ప్రశ్న ఇంట్లో వాళ్లు అడగడమే కాదు, నాకూ చాలా సార్లు అనిపించింది. అయినా మనం అంత తేలిగ్గా మారతామా?

'అలజడి మా వూపిరి' అని శ్రీశ్రీ అన్నట్టు హడావుడి మా వూపిరి, అవసరం లేనప్పుడు కూడా. లేకపోతే ప్రతిసారీ ఆలస్యంగానే పరుగులు తీయడం అవలక్షణం తప్ప మంచిదెలా అవుతుంది?

ఇవన్నీ తర్కించుకుంటూనే ఇంటికి వెళ్లడం, నాలుగు మగ్గుల నీళ్లతో స్నానం చేశాననిపించి, నాలుగు ముద్దలు తిని... రెండు జతల బట్టలు బ్యాగులో కుక్కుకుని బయల్దేరడం అన్నీ చక చకా... అయిపొయ్యాయి.

ఆటో పట్టుకుని.. అదనంగా పది రూపాయలివ్వడానికి ఒప్పుకుని వెళ్తుంటే... దారి పొడుగునా టెన్షనే. ఎక్కడైనా ట్రాఫిక్ జాం అవుతుందేమోనన్న దిగులు.. మాటి మాటికీ గడియారం చూసుకుంటూ, నిముషాలు లెక్కించుకుంటూ బస్సు ఆలస్యంగా బయలు దేరాలని కోరుకుంటూ ఎంజిబిఎస్ చేరాను.

హమ్మయ్య! ఎక్కవలసిన బస్సు ఎదురుగా ఆహ్వానించింది. నువ్వెక్క వలసిన రైలు ఎప్పుడూ ఒక జీవిత కాలం లేటు అని ఆరుద్ర ఎందుకన్నాడో అర్థమైంది.

◆◆◆

బస్సులో ఎక్కేసరికి టికెట్లు చెక్ చేస్తున్నారు. నా టికెట్ చూసుకుందామంటే షరా మామూలే. ఎంత వెతికినా ఓ పట్టాన దొరకలేదు. తర్వాత ఎప్పటికో జేబులో ఒక మూలన దొరికింది. దాన్ని చూపించి ఆయన గారి రాజముద్ర వేయించుకుని ఆసీనుడనయ్యాను.

పక్క సీటులో వాళ్లను అదే పనిగా మాట్లాడించడం కంటే మౌనంగా గమనించడమే నాకు ఇష్టం. ఎందుకంటే మాట్లాడ్డం మొదలెడితే నేనే ఎక్కువ మాట్లాడతాను. కాదని అవతలి వారిని మాట్లాడనిస్తే ఏవేవో చెప్పేస్తుంటారు. ఆసక్తి సంగతి అలా వుంచి, అర్థం లేనివి కూడా చెప్పేస్తుంటారు. వాటిని ఖండించేంత అవసరం వుండదు. ఆమోదించేంత సౌజన్యమూ వుండదు. ఇంతా చేసి అంతలేసి స్టేట్మెంట్లు ఇచ్చిన పొరుగు ప్యాసింజర్లు ఎక్కడో దిగిపోతారు. జీవితంలో మళ్లీ కనిపించకపోవచ్చు. కనిపించినా గుర్తుండకపోవచ్చు. ఇలా ప్రయాణాలలో ఎన్ని వందల మందితో మాట్లాడామో.. అయినా కలుపుగోలు అనుకునేవారు మాత్రం ఆ కాస్సేపట్లోనే లోకాన్నంతా ఏకరువు పెట్టి విజ్ఞాన సర్వస్వం అనిపించుకుందామని మహా ఇదై పోతుంటారు. అందుకని పక్కవారిని మాట్లాడించకపోవడమే గాక వారి ప్రశ్నలకు క్లుప్తంగా జవాబు చెబుతుంటాను. కొంతమంది మొండి ఘటాలు మాత్రం ఒక పట్టాన వదిలి పెట్టరు.

ఈ రోజు నా పక్కనున్నది అలాంటి శాల్తీయేనని కాసేపట్లోనే అర్థమైంది.

టైమెంతైంది అంటూ మొదలెట్టి కాసేపటికి కొటేషన్లు చెప్పడం మొదలెట్టాడు.

అతని ఏకపక్ష దాడికి బలికావడమెందుకని నేనూ మాట్లాడ్డం మొదలెట్టాను.

మనం మాట్లాడితే కాస్సేపట్లో రాజకీయాలు రావలసిందే. ఆ పైన ఉద్యమాలు, సిద్ధాంతాలు..

నా పక్కనున్న ప్యాసింజరుకు అవన్నీ పెద్దగా ఆసక్తి కలిగించలేదు. విజయవాడలో తను ఎన్నో చూశాడట. ఆ రోజులు వేరు సార్. ఇప్పుడంతా మారిపోయిందన్నాడు.

అతను తెలియక మాట్లాడుతున్నాడని తెలిసి.. తెలియజేయడానికి అతిగా ప్రయాస పడనవసరం లేదనుకుని అనుకూల పరిస్థితిల్లోనూ ఉద్యమాలు నిలబడ్డాయని చెప్పాను.

"కుర్రాళ్లు ఎవరొస్తున్నారు సార్?" అన్నాడతను.

"నాతో రండి చూపిస్తాను. రోజూ పోరాటాలు చేస్తున్నారు. లాఠీ దెబ్బలు తింటున్నారు. జైళ్లకు కూడా వెళుతున్నారు. సమస్యల్లేవని కాదు, కాని ప్రగతిని ఆహ్వానించే శక్తి ఈ తరానికి లేదంటే ఒప్పుకోను" అని గట్టిగానే అన్నాను.

ఆ సమాధానం అతనికే కాదు, నాతో చాలా మంది అనే మాటలకు ఎప్పుడూ నేను చెప్పే జవాబు.

దానిపై నా దగ్గర చాలా సమాచారమే వుంది. ఎప్పటికైనా దాన్ని వివరంగా రాసి లోకం ముందుంచాలని అనుకుంటాను. కాని అవన్నీ అతనికి చెప్పలేను.

"మాష్టారూ... డబ్బున్న పార్టీలు చేసే హంగామాలన్నీ ప్రజల పార్టీలు చేయవు. అవసరం లేదు కూడా. అలాగని దానర్థం ఆ పార్టీ వెనుక యువతీయువకులు లేరని కాదు. మీరే చూస్తారుగా ముందు ముందు" అని ముగింపుగా అన్నాను.

"కావచ్చు సార్, కాని వాళ్ల కుటుంబాల్లో పిల్లలే వారి వెనక రాకపోవడం చాలా సార్లు చూశాను" అన్నాడు.

అట్టే పొడిగించే ఆలోచన లేదు. పైగా అతనన్నది పూర్తిగా అబద్ధం కూడా కాదు. అనేక కారణాలుండే వుండొచ్చు గాని నిజం కాదని

చెప్పలేం..

ఆమాటే సౌమ్యంగా అన్నాను. "అయితే ఒకటండీ... ఒకసారి ఈ ప్రభావానికి గురైన మనిషిలో ఏదో ఒక మూల ఆ చైతన్యం వుంటుంది" అన్నాను. అలాంటి ఉదాహరణలు గుర్తుకు వచ్చినా చెప్పేపని పెట్టుకోలేదు.

ఇంతలో విజయవాడ బస్టాండు వచ్చేసింది. ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా బ్యాగులు పుచ్చుకుని నమస్కారాలు చెప్పుకుని దిగాం.

◆◆◆

బస్టాండు బయటికి వచ్చాను. నాకు స్వాగతం పలకడానికి చాలా మంది నిరీక్షిస్తున్నారు. అందరి చూపూ నాపైనే వున్నట్టు అనిపించింది. ఒకింత ఇబ్బందిగానూ వుంది. వారి దగ్గరకు వెళ్లే లోపు చాలా మంది 'సార్ రిక్షా' అంటూ...తగిలారు. ఆటోలు అలవాటైన తర్వాత రిక్షాలు ఎక్కుతామా? వూహూ...

"లేదు లేదు.." అని చెప్పకుంటూ అడుగులు వేస్తున్నాను.

"ఇక్కడే సార్, లాడ్జి కావాలన్నా తీసుకెళతాను సార్" ఒకతను మరీ ఎక్కువగా వెంటపడ్డాడు.

ఒకోసారి పోనీ ఎక్కేద్దామనిపిస్తుంది. అలా అని ఎక్కితే చాలా దూరం తొక్కకుండా లాగుతూ నడిపించడం ఇబ్బందిగా వుంటుంది. ఆ నిదానమే గాక లాగడం కూడా.. అందుకే అనివార్యంగా ఆటో ఎక్కేస్తుంటాను.

వాళ్లు కూడా బాగానే వెంట పడతారు. కాకుంటే రిక్షా వాళ్లకన్నా కొంచెం భిన్నంగా.. 'ఎక్కడికెళ్లాలి సార్?' అని మొదలెడతారు. ఫలానా చోటికి అనగానే 'రండి వెళిపోదాం' అనో 'వెళదాం' అనో చనువుగా అనేస్తారు. అందులో బోలెడు గడుసుతనం కూడా. బేరం మాట ఎత్తరు. 'ఎంత?' అన్నాక 'యాభై రూపాయలిప్పించండి మీకు తెలియందేముంది' అంటూ.. అసలు మాట బయటపెడతారు.

"నాకు తెలుసు బాబూ అంత ఇవ్వరని.."

"పెట్రోలు రేట్లు పెరిగాయి కద సార్ మీరూ ఆలోచించండి"

"నిజమే బాబూ, దానికి కావాలంటే చెప్పు ఇద్దరం ధర్నా చేద్దాం, నేనెక్కడ ఎక్కువ ఇవ్వగలను" అంటూ మరో బేరం చూసుకోవడానికి ప్రయత్నిస్తుంటే వొప్పేసుకుంటారు. ఇదో రివాజు ఇక్కడ.

అయినా ఇంకా నగరం కాలేదు గనక గాని సిటీలో ఇంతగా వెంటపడటం, మాట కలపడం వుంటుందా? ఇక్కడ ఘరానాగా అడగడంలోనూ ఒకింత చనువు శ్రద్ధ కనిపిస్తున్నాయి. అదే మహానగరాల్లోనైతే దిగగానే బుట్టలో వేయడం తప్ప మాట్లాడే పని వుండదు.

ఇలా ఏదేదో ఆలోచించుకుంటూ అడుగులు ముందుకేస్తున్నాను. ఆటోల వాళ్లు ఒకరిద్దరు వచ్చి బేరమాడి వెళ్లి పోతున్నారు. చాలా చనువుగా, చొరవగా వచ్చిన వాళ్లు రేటు దగ్గరకొచ్చే సరికి దూరమవుతున్నారు. ఇదంతా మామూలే.. ఎవరి బతుకు తెరువు వారిది. ఎవరి తాపత్రయం వారిది.

"ఎక్కడికి వెళ్లాలి సార్?" కుర్ర డ్రైవర్ అడిగాడు.

"పార్కు" అని చెప్పాను.

"పార్కు దగ్గరే దిగుతారా... లోపలకి వెళ్లాలా?"

"పార్కు అంటున్నాను కదా అన్ని ప్రశ్నలెందుకయ్యా?"

"కాదండీ మాష్టారూ, కొంతమంది ఇక్కడే ఇక్కడే అంటూ బోలెడు దూరం తీసుకుపోతారు.."

"అదేం లేదులే... ఎంతివ్వాలి చెప్పు"

"నలభై ఇవ్వండి"

"అదేమరి, ఎక్కండంటూ అంత చెబితే ఎలా?" కాస్త విసుగ్గా అంటూ నాలుగడుగులు వేశాను. ప్రపంచంలో కెల్లా ఆటోవాళ్లే మోసగాళ్లన్నట్టు కొంతమంది మాట్లాడుతుంటారు గాని నాకు అలాంటి భావం లేదు. కాకుంటే మిగిలిన విషయాల్లోలాగే ఇక్కడా బేరాలు తప్పవు. ఇవన్నీ ఆలోచిస్తుండగానే ఒకతను పలకరించాడు.

"వుండండి. ఆటో తెస్తాను" అంటూ వెళ్లిపోయాడు. ఇది కూడా సర్వసాధారణమే గాని బేరాల పర్వం కొనసాగించే ఓపిక నాకు లేదు. అందుకే ఆ సంగతి స్పష్టం చేసుకోవాలని అడిగాను.

"ఎక్కండి సార్, మీరు ఫలానా వారే కదా.." అని అడిగాడు.

"ఔను" అన్నాను.

"నేను హోటల్ వర్కర్స్ సెక్రటరీ కృష్ణ గారి కొడుకునండీ.. మీకు తెలుసుకదండీ" అన్నాడతను.

"ఆ...ఆ... తెలుసు తెలుసు" అన్నాను కాస్త సందేహంగా. చూసి చాలా రోజులైంది కదా.. నిజానికి గుర్తున్నట్టే వుంది.

"యూనియన్ లీడర్‌గా చాలా రోజులు చేశాడండి. తర్వాత జబ్బు చేసింది. పెద్దగా బయటకు రాలేకపోయే వాడు"

"అలాగా! ఇప్పుడెలా వుంది?"

"ఆరు నెలల కిందటే కాలం చేశాడు"

"అయ్యో.. నేను ఈ మధ్య టచ్‌లో లేను.." అన్నాను నొచ్చుకుంటూ..

"పర్వాలేదండీ... కాని మిమ్మల్ని ఎప్పుడూ అనుకునేవారండీ.. టీవీలో మీరు వస్తే చాలు, ఇంటిల్లిపాదినీ పిలిచి చూపించేవారు.."

"ఆహా అలాగా" అన్నాను ఏమనాలో తోచక.

"అయితే మీ నాన్న హోటల్ యూనియన్ అయితే నీవు ఆటో యూనియన్ అన్న మాట" అన్నాను కాస్త కలుపుగోలుగా.

"లేదండీ.. చెప్పకేం... నేను మన యూనియన్‌లో లేనండి. కొన్ని రోజులుండి విడిపోయాను..." అన్నాడు.

"దాటేయకుండా చెప్పడం కాస్త బాగానే అనిపించింది.

"దాందేముందిలే... మళ్లీ నీవే రావచ్చు"

"అచ్చే నాకు ఏం వ్యతిరేకం లేదండీ.. ఏదో అలా జరిగిపోయింది" అంటూ వివరణ ఇచ్చుకున్నాడు.

అక్కడి నుంచి ఆటో కాస్త వేగం పెరిగింది. ఇంతా చేస్తే అయిదు నిముషాల్లో గమ్యం వచ్చేసింది. అంతకు ముందు ఇదే పెద్ద దూరమనిపించేది. కాని మహానగరాలు అలవాటైన తర్వాత పట్టణాల్లో దూరాలు లెక్కలోవి కావనిపిస్తుంది.

ఆఫీసు ముందు దించి మరోసారి ఆనందం వ్యక్తం చేశాడు.

జేబులోంచి ఇరవై రూపాయలు తీసి ఇవ్వబోయాను. కాని తీసుకోలేదు.

"వద్దండీ..." అన్నాడు.

"అలా అయితే నీ ఆటో ఎక్కేవాణ్ని కాదు. ఎక్కువ తీసుకోకూడదు కాని అసలే వద్దంటే ఎట్లా" అని కాస్త చనువుగా అన్నాను.

"లేదండీ.. మా నాన్నకు ఈ జెండా అంటే ప్రాణమండీ... నేను వేరే యూనియన్‌లో వున్నా ఏమీ వ్యతిరేకం కాదు.. కాకపోతే ఉదయాన్నే మీరు నా ఆటోనే వెతుక్కుంటూ వచ్చి ఎక్కినందుకు చాలా సంతోషంగా వుంది..ఈ ఒక్కసారికి కిరాయి తీసుకోకపోతే నాకొచ్చే నష్టమేమీ లేదు. మీరు అన్ని ఆటోలు వదలిపెట్టి నా దగ్గరికే రావడం చాలా సంతోషమనిపిస్తుంది. ఒక్కసారి కిరాయి తీసుకోకపోతే ఏం? నాకు ఇప్పుడు తృప్తిగా వుంది" అన్నాడతను. గొంతులో ఓ విధమైన నిజాయితీ ధ్వనిస్తున్నది.

అతని భుజం తట్టి బండి తిప్పుకుంటుంటే చూస్తూ కాస్సేపు నిల్చుని వాళ్ల నాన్న కృష్ణను గుర్తు చేసుకుంటూ లోపలికి నడిచాను.

గదిలో చూస్తే పైన మార్క్సు, ఎంగెల్సు, లెనినూ, స్టాలినూ, సుందరయ్యా... మహామహుల ఫోటోలు పలకరిస్తున్నాయి.

కిటికీలోంచి చూస్తే ఎదురు ఆవరణలో మోదుగు పూలు ఎర్రగా ప్రకాశిస్తున్నాయి.

ఇంతలోనే నన్ను తీసుకుపోవడానికి ఓ యువ కార్యకర్త వచ్చాడు. కాస్త కుంటుతున్నాడు. ఏమైందని అడిగాను.

"మొన్న ఫీజుల ధర్నాలో పోలీసులు కొట్టారు" సార్ అన్నాడు.

"లాల్ సలామ్.." అన్నాను వెంటనే లేచి.

"అదేంటి సార్ మీరు" అని అతను కాస్త ఇబ్బంది పడ్డాడు.

ఇందాకటి బస్సు శాల్తీ గురించి మార్గమధ్యంలో చెప్పొచ్చు లెమ్మనకుంటూ కదిలాను.

★



పరీక్షల సీజన్ మరి!

మార్చి నెలంటే పిల్లలందరికీ టెన్షన్... టెన్షన్! అమ్మో పరీక్షలు దగ్గరికొచ్చేశాయ్. టైం చాలా తక్కువగా ఉంది. చదవాల్సిందేమో చాలా వుంది. ఇదంతా ఎప్పుడు పూర్తవుతుందో ఏమో! అంటూ తెగ ఆందోళన పడిపోతుంటారు. తోటివారి కంటే ఎక్కువ మార్కులు తెచ్చుకోవాలని కంగారు పడుతుంటారు. ఇవన్నీ ఆలోచిస్తూ ఏకాగ్రతను కోల్పోతుంటారు. ఉన్న కొద్ది సమయాన్నీ వృధా చేసుకుంటుంటారు. అటువంటప్పుడే తల్లిదండ్రుల సలహాలు, సూచనలు పిల్లలకు అవసరమౌతాయి.

"**ఏం** పిల్లాడివిరా బాబూ! పరీక్షలు దగ్గరకొచ్చేదాకా ఆటలాడావు. తీరా పరీక్షలు నెల రోజులున్నాయనగా టెన్షన్ పడుతున్నావు. ఎప్పుడు చెప్పిన పాఠాలు అప్పుడే చదువుకుంటే ఇప్పుడింత టెన్షన్ ఉండదు కదా? ఇప్పుడు చూడు ప్రీ ఫైనల్లో ఎంత తక్కువ మార్కులు వచ్చాయో? ఇప్పుడు బాధపడుతూ కూర్చుంటే ఏం లాభం?" అంటూ కవిత పదవ తరగతి చదువుతున్న తన కొడుకు ప్రదీప్‌ని కోప్పడుతోంది.

"పిల్లాడు చదువుతున్నాడా లేదా అని చూడాల్సిన బాధ్యత నీకు లేదా?" అని కవిత భర్త కారుణ్య అడిగాడు కోపంగా.

"నాది మాత్రమేనా. అది నీ బాధ్యత కూడా" అంది కవిత అంతే కోపంగా. అలా భార్యాభర్తలిద్దరూ గొడవపడ్డారు. కానీ ఇదికాదు కదా పరిష్కారం. ముందు వున్న సమయంలో పిల్లవాడిని చక్కగా చదివించడమెలాగో ఆలోచించడం కదా పెద్దలు చేయాల్సింది.



ఇది పిల్లలున్న ప్రతి ఇంట్లో జరిగే సంఘటనే. ఎంత హడావుడి జీవితమైనా పిల్లలు చదువుతున్నారా లేదా అని చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే.

తల్లిదండ్రులు పిల్లలను గమనిస్తూ వారి చదువు విషయంలో సలహాలిస్తుండాలి.

అలాగే వారు శారీరకంగా, మానసికంగా అలసిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పరీక్షల సమయంలో వారికి ఇష్టమైన, ఆహారపదార్థాలు తయారు చేసి పెట్టాలి. అలా అని వారికి ఇష్టమైన ఆయిల్ ఫుడ్ ఎక్కువగా ఇవ్వకూడదు.

చక్కగా చదువుకుంటున్నారు కదా ఎందుకు డిస్టర్బ్ చేయడం అని వారికోసం ఓ గది కేటాయించేస్తుంటాం. అది మంచి పనే కానీ మరీ పూర్తిగా వారిని ఆ గదికే పరిమితం చేయకుండా కుటుంబ సభ్యులందరితో రోజులో కొంతసేపైనా కలిసి మాట్లాడేలా చూడాలి. అలా చేయడం వల్ల వారు ఎక్కువ ఒత్తిడి గురవకుండా వుంటారు.

అలాగే రోజులో కాసేపు వారికి ఇష్టమైన పాటలు వినడం, ఆటలాడడం కూడా అవసరమే. ఇలా చేయడం వల్ల వారు ఉత్సాహాన్ని పొందుతారు. తిరిగి మరి కొంత సేపు చదవడానికి కొత్త శక్తి వస్తుంది.

రాత్రి ఎక్కువ సమయం చదువడానికి టీ, కాఫీలు ఎక్కువసార్లు ఇవ్వకూడదు.

వారు ఎక్కువ వత్తిడికి గురయితే అది మీద తీవ్రమైన ప్రభావం చూపిస్తుంది. జ్ఞాపకశక్తి తగ్గిపోతుంది. అంతే కాదు ఏకాగ్రతగా చదవలేరు కూడా.

చదవాల్సిన పాఠ్యాంశాల గురించి కంగారు పడకుండా చూడాలి.

మొత్తం ఒకసారి పూర్తయిన పాఠాలే కనుక ముందుగా బాగా వచ్చిన పాఠాలను త్వరగా పూర్తి చేసుకునేలా చూడాలి.

కష్టంగా అనిపించిన పాఠాలకు ఒక ప్రణాళిక తయారు చేసుకోవడం వల్ల చదవడం తేలికవుతుందని చెప్పాలి.

రాత్రి ఎక్కువ సమయం మేల్కొనకుండా జాగ్రత్త పడాలి.

ఉదయం నాలుగు గంటకు కూర్చుని చదివితే మెదడు ప్రశాంతంగా ఉండి చదివింది బాగా గుర్తుంటుంది. అయితే కొందరు పిల్లలు రాత్రుళ్లు శ్రద్ధగా చదువుకుంటారు. ఎవరికి ఏ సమయంలో అనుకూలంగా వుంటే అప్పుడు చదువుకునేలా చూడాలి.

ప్రతిరోజూ తప్పనిసరిగా 6 నుండి 8 గంటలు నిద్రపోయేలా చూడాలి.

ఒక సబ్జెక్టునే ఎక్కువ సమయం చదవకూడదు. ప్రతి సబ్జెక్టుకు మధ్య కొంత సమయం గ్యాప్ ఇవ్వాలని చెప్పాలి.

ఎక్కువసేపు అలా చదువుతూ కూర్చున్నా కళ్లు అలసటకు గురవుతాయి. అలాంటప్పుడు విశ్రాంతిగా ఓ ఐదు నిమిషాలు కళ్లు మూసుకుని రిలాక్సవ్వమనాలి.

- మల్లేశ్వరి

అరచేతిలో విశ్వదర్శనం



దశాబ్దం కిందట సొంతంగా మొబైల్ ఫోన్ వుండటమే ఓ విలాసం. ఇప్పుడు పరిస్థితి చెప్పక్కర్లేదు. జీవితంలో 'ప్రాథమిక' అవసరమై పోయింది. సాంకేతిక రంగంలో ఇదో విప్లవం. చేతిలో ఇమిడిపోయే ఈ ఫోన్‌లోనే మొబైల్ ఇంటర్నెట్ రూపంలో మరో విప్లవం చోటుచేసుకుంటోంది. చేతిలోనే విశ్వసందర్శనం చేసే వీలు కల్పిస్తోంది. అత్యంత వేగవంతమైన 3జి సేవలు అందరికీ అందుబాటులోకి వస్తే మొబైల్ ఇంటర్నెట్ వినియోగదార్ల సంఖ్య మరింతగా ఊపందుకుంటుంది. మొబైల్ ఇంటర్నెట్ మార్కెట్ పురోగతులపై బిజీసిటి నిర్వహించిన ప్రపంచవ్యాప్త సర్వేలో ఆసక్తికర విషయాలు వెలుగుచూశాయి. మొబైల్ ఇంటర్నెట్ వినియోగంలో మొదటి పది దేశాల్లో మన దేశం చోటుదక్కించుకుంది. మరి ఆ వివరాలేంటో తెలుసుకుందాం.

ఇంటర్నెట్ వినియోగం ప్రస్తుతం మొబైల్ ఫోన్లలోనూ జోరందుకుంది. బ్రౌజింగ్‌తోపాటు మెయిల్స్ పంపుకోవడం, ఛాటింగ్ వంటి అవకాశాలు వుండడంతో ఎక్కువగా యువతరం దీనిపై ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లోకి విడుదలవుతున్న అన్ని కంపెనీల మొబైల్‌ఫోన్లలో తప్పనిసరిగా జిపిఆర్ఎస్ సదుపాయం వుండటం కూడా ఈ మోజుకు కారణమవుతోంది. ఇక హై ఎండ్ మొబైల్స్‌లో వేగవంతమైన ఇంటర్నెట్ కోసం వైఫై, ఎడ్జ్ వంటి అధునాతన ఫీచర్లు కూడా వుంటున్నాయి. అయితే ప్రపంచంలోనే ఎక్కువగా సెల్‌ఫోన్లు వాడుతున్న భారత్‌లో అందుబాటులో వున్న టెక్నాలజీ, సౌకర్యాలను సమర్ధవంతంగా వినియోగించుకోలేకపోతున్నారని ప్రపంచవ్యాప్తంగా నిర్వహించిన ఒక సర్వే వెల్లడి చేసింది. ఈ సర్వే ప్రకారం మొబైల్ ఇంటర్‌నెట్‌ను భారతీయ యువత చాలా తక్కువగా ఉపయోగిస్తున్నారని తెలిసింది. 'యువత-సెల్‌ఫోన్‌ల ఉపయోగం' అనే అంశంపై నిల్సన్ అనే పరిశోధనా సంస్థ జరిపిన సర్వేలో ఈ విషయం బయటపడింది. గత నెలలో సెల్‌ఫోన్ ద్వారా ఇంటర్‌నెట్‌ను ఉపయోగించిన యువతను ప్రపంచ వ్యాప్తంగా పరిశీలించగా, భారత దేశంలోని యువకులు పది శాతం కంటే తక్కువగా ఈ సౌకర్యాన్ని వినియోగించుకుంటున్నారని ఆ సంస్థ ప్రకటించింది. ఇదే సమయంలో మొబైల్ ఇంటర్‌నెట్ ఉపయోగంపై చైనాలోని 15-24 సంవత్సరాలు మధ్య వున్న యువతను పరిశీలిస్తే అత్యధికంగా 73 శాతం ఉపయోగిస్తున్నట్లు తెలిసింది. ప్రపంచవ్యాప్తంగా సెల్‌ఫోన్ అభిరుచిపై ఆ దేశ సాంస్కృతిక, ఆర్థిక, వయో సంబంధ అంశాలు పెద్ద ఎత్తున ప్రభావం చూపుతాయని సర్వే పేర్కొంది. నిల్సన్ పరిశోధనా సంస్థ వెల్లడిచేసిన ఈ నివేదికను "ది ఇండిపెండెంట్" అనే పత్రిక ప్రచురించింది. ఈ సర్వేలో 15-24 సంవత్సరాల మధ్య భారత్‌కు చెందిన యువకులు యువతుల కంటే ఎక్కువగా రెండు రెట్లు (ఎస్ఎంఎస్) సందేశాలు పంపించారు. అంతేకాక యువకులే ఎక్కువగా చిత్రాలతో కూడిన సందేశాలను పంపారని ఈ నివేదిక తెలిపింది. అయితే చైనా, సౌదీ అరేబియాలకు చెందిన యువకులు కూడా ఈ విధమైన సందేశాలు పంపారు కానీ భారత్‌తో పోల్చుకుంటే చాలా తక్కువగానే పంపారని తెలిపింది. గత 30రోజుల్లో చైనా యువత అత్యధికంగా మొబైల్ ఇంటర్‌నెట్‌ను ఉపయోగించారని, అమెరికాలోని యువత 48 శాతం, బ్రిటన్‌లో 46 శాతం యువత ఉపయోగిస్తున్నారని తెలిసింది. సౌదీ అరేబియన్‌లోని యువత ఎక్కువగా రింగ్ టోన్లను, స్క్రీన్‌సేవర్లను తమ మొబైల్ ఫోన్లలోకి డౌన్‌లోడ్ చేసుకున్నారని, అమెరికాలోని యువత ఎక్కువగా ఫోన్లను ఇమెయిల్‌ను పంపటం కోసమే ఉపయోగిస్తున్నారని ఈ పరిశోధన వివరించింది.

కంప్యూటర్లలో మాదిరిగానే ఇప్పుడు మొబైల్ ఫోన్లలోనూ వేగవంతమైన ఇంటర్నెట్ సదుపాయాన్ని పొందవచ్చు. ఇందుకు మీరు కొనే మొబైల్‌ఫోన్‌లో ఇంటర్నెట్‌కు సంబంధించిన కొన్ని ఫీచర్లువుంటే చాలు. అలాగే బ్రౌజింగ్ అప్లికేషన్లు కూడా. మొబైల్ ఇంటర్నెట్ విషయానికొస్తే... ఇందులో మూడురకాల ఫీచర్లు వుంటాయి. అవి... జి.పి.ఆర్.ఎస్, వైఫై, ఎడ్జ్.

జి.పి.ఆర్.ఎస్ (జనరల్ ప్యాకెట్ రేడియో సర్వీస్): మొబైల్ ఫోన్లలో ఇంటర్నెట్ సదుపాయం కోసం ఈ నెట్‌వర్క్‌ను ఉపయోగిస్తారు. జి.పి.ఆర్.ఎస్ విధానంలో ఇంటర్నెట్ స్పీడ్‌ను క్లాస్‌లుగా వర్గీకరిస్తారు. ఈ జిపిఆర్ఎస్ ఆవిర్భవించినప్పుడు క్లాస్6 వుండేది. పెరుగుతున్న సాంకేతిక ప్రగతి దీనిలోనూ స్పష్టంగా కనిపిస్తుంది. ప్రారంభంలో క్లాస్6గా వున్న దీని వేగం ప్రస్తుతం క్లాస్33కి చేరింది. ఈ సదుపాయం కలిగిన ఫోన్లలో ఇంటర్నెట్ బ్రౌజింగ్ చేసుకోవాలంటే దీనికి సంబంధించిన సెట్టింగ్స్‌ను బిఎస్ఎన్ఎల్, ఎయిర్‌టెల్, ఐడియా, ఒడాఫోన్, ఎయిర్‌సెల్, టాటా డొకోమో వంటి 'సెల్యూలార్ నెట్‌వర్క్ ప్రొవైడర్లు' నుండి పొందాల్సి వుంటుంది. సాధారణంగా నోకియా కంపెనీ మొబైల్స్‌లో జిపిఆర్ఎస్ సౌకర్యం ఆటోమ్యాటిక్‌గా ఎనేబుల్ అవుతుంది. ఇతర కంపెనీ మొబైళ్లలో మాత్రం ఆయా కంపెనీల కస్టమర్ కేర్ అందించే సూచనల మేరకు మార్చుకోవాల్సి వుంటుంది. ఈ జిపిఆర్ఎస్ ఫీచర్ ద్వారా ఇంటర్నెట్ సదుపాయం కల్పిస్తున్నందుకు ఆయా నెట్‌వర్క్ ప్రొవైడర్లకు ప్రతినెలా కొంత రుసుము చెల్లించాల్సి వుంటుంది.

<u>వైఫై</u> (వైర్‌లెస్ ఫిడిలిటీ): ఈ ఫీచర్ ద్వారా నిర్ణీత ప్రదేశంలో కొంత పరిధి వరకు ఎలాంటి వైర్లు లేకుండానే ఉచితంగా ఇంటర్నెట్ బ్రౌజింగ్, డేటా అప్‌లోడ్, డౌన్‌లోడ్ వంటి సదుపాయాలు పొందవచ్చు. ఈ విధానంలో అక్కడక్కడ రూటర్లను ఏర్పాటు చేస్తారు. వీటికి ఆయా రూటర్ల యజమానులు ఎవరికి వారు ఒక కోడ్‌ను నిర్ణయిస్తారు. మొబైల్ ఫోన్లలో ఈ తరహా పరిజ్ఞానాన్ని సపోర్ట్ చేసే వైఫై ఫీచర్ వున్నప్పుడు ఈ రూటర్ల పరిధిలోకి రాగానే ఆ కోడ్ మొబైల్‌ఫోన్‌లో కనిపిస్తుంది. ఆ కోడ్‌ను ఎంపిక చేసుకుని ఓకె చేయగానే మీ మొబైల్‌ఫోన్ అక్కడికి దగ్గరలో వున్న రూటర్‌కు అనుసంధానం అవుతుంది. ఆ రూటర్ పరిధిలో వున్నంతసేపు ఉచితంగా ఇంటర్నెట్ బ్రౌజింగ్, అప్‌లోడ్, డౌన్లోడింగ్ సాధ్యమవుతుంది. ఈ సౌలభ్యం పొందుతున్నందుకు నెట్‌వర్క్ ప్రొవైడర్‌కు పైసా కూడా చెల్లించనవసరం లేదు. అయితే ఈ వైఫై ఫీచర్ వున్న మొబైల్స్ ఖరీదు మాత్రం ఎక్కువగానే వుంటుంది. ప్రస్తుతం రూ.10 వేలు ఆపై ధర వున్న ఫోన్లలో ఈ వైఫై, ఎడ్జ్‌వంటి ఫీచర్లు వుంటున్నాయి. ప్రస్తుతం చాలా నగరాల్లో ఈ వైఫై రూటర్ల సదుపాయం అందుబాటులో వుంది. హైదరాబాద్‌లో... శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్, కేఫ్ కాఫీడేతోపాటు పెద్దపెద్ద మాల్స్, సాఫ్ట్‌వేర్ కంపెనీలున్న ప్రాంతాల్లో ఈ తరహా రూటర్లు అమర్చబడ్డాయి. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో వున్న రూటర్ ఆ చుట్టుపక్కల 5కి.మీ. మేర వుంటుంది. అంటే ఈ ఎయిర్‌పోర్టుకు 5కి.మీ. విస్తీర్ణంలో ఎక్కడనుండైనా ఉచితంగా ఇంటర్నెట్ బ్రౌజింగ్ చేసుకోవచ్చు. వైఫై సదుపాయం వుంటే చాలు.

ఎడ్జ్ (ఎన్‌హ్యాన్స్‌డ్ డేటా ఫర్ గ్లోబల్ ఎవల్యూషన్): దీనిని ఇ.జి.పి.ఆర్.ఎస్ అని కూడా పిలుస్తారు. ఇది జి.పి.ఆర్.ఎస్ కంటే అధునాతన సాంకేతిక పరిజ్ఞానం. మామూలు జి.పి.ఆర్.ఎస్ కంటే మూడు రెట్లు వేగం ఈ ఎడ్జ్ పరిజ్ఞానం సొంతం. ఈ సదుపాయం ద్వారా మొబైల్ వినియోగదారులకు ఏ రకమైన అంతరాయంలేని హైస్పీడ్ ఇంటర్నెట్ బ్రౌజింగ్‌తోపాటు డేటా అప్‌లోడ్, డౌన్లోడ్ కూడా వేగంగా జరుగుతుంది.

<u>బ్రౌజర్లు</u>: జి.పి.ఆర్.ఎస్ సదుపాయం కలిగిన మొబైల్ ఫోన్లలో ఇన్‌బిల్ట్‌గానే ఇంటర్నెట్ బ్రౌజర్లు వుంటున్నాయి. లో-ఎండ్ మొబైల్లో హెచ్‌టిఎంఎల్, వ్యాప్ తదితర బ్రౌజర్లు, హై-ఎండ్ మొబైల్స్‌లో ఒపేరా మొబైల్, ఒపేరీ మినీ, స్కైఫైర్, సఫారీ, మొజిల్లా మినిమో, మొజిల్లా ఫెన్నెక్, బిట్ స్ట్రీమ్ థండర్ హాక్, నెట్ ఫ్రంట్, ఫైఫ్లస్, టచ్ వంటి బ్రౌజర్లు అందుబాటులో వున్నాయి. టచ్‌స్క్రీన్ సదుపాయం వున్న మొబైల్స్‌లో ఆ బ్రౌజర్‌ను తాకితే చాలు ఇంటర్నెట్ మీ అరచేతిలో ప్రత్యక్షమౌతుంది.

- కె.ఎక్స్. రాజు

నెమలి

పిల్లలూ... మీకు తెల్సిన పక్షుల పేర్లు చెప్పండి. ఏంటీ పది పేర్లు చెప్పేసరికే ఆలోచనలో పడిపోయారు. సర్సరి! ఇక నుండి వారానికో పక్షి గురించి తెలుసుకుందాం. ఇవాళ నెమలి గురించి చెప్పకుందాం.

మన జాతీయ పక్షేంటో మీకు తెలుసు కదూ. ఆ.. అదే నెమలి. పక్షుల్లోకెల్లా అందమైన పక్షి కూడా నెమలే. సాధారణంగా నెమలి గురించి తెలియని వాళ్లు ఉండరు. నెమలీకల్ని పుస్తకాల్లో దాచుకోవడం భలేగా వుంటుంది కదూ. మగ నెమలికి (పుంజు) వెనుక భాగాన వేలాడే తోకకి నెమలి కన్నులు వుంటాయి. నిజానికి అది తోక కాదు. తోక భాగాన్ని కప్పి ఉన్న ఈకల పుంజం. కానీ ఆడ నెమలి (పెట్ట)కి పింఛం ఉండదు. తలమీద రెండింటికీ తురాయి ఉంటుంది. ఆడ నెమలికి శరీర భాగమంతా గోధుమరంగులో ఉంటుంది. ఇంకా శరీరం మీద చుక్కలు కూడా ఉంటాయి. మెడ కిందిభాగం ఆకుపచ్చ రంగులో నిగనిగలాడుతూ మెరుస్తుంటుంది. ఈ నెమళ్లు అస్సలు ఒంటరిగా తిరగవు. ఎప్పుడూ గుంపులుగానే సంచరిస్తాయి. వీటికి జాగ్రత్త చాలా ఎక్కువ. వాటిపై ఎవరైనా వేటగాళ్లు గానీ, లేదా ఏవైనా జంతువులు గానీ దాడి చేసినప్పుడు దగ్గర్లో ఉన్న తుప్పల్లోకి పరుగెత్తుతాయి. అలా కుదరనప్పుడు నిట్టనిలువుగా పైకి ఎగురుతాయి. వీటి రెక్కలు అదేనర్రా పింఛం చాలా పెద్దగా ఉంటుంది కదా. అయినా చాలా ఈజీగా, వేగంగా ఎగురుతాయి. రాత్రి పూటేమో చెట్లమీద పడుకుంటాయి. ఇవి చూడ్డానికి అంత బాగుంటాయి కదా. వీటి అరుపులు మాత్రం కర్ణకఠోరంగా ఉంటాయి. ఇవి సర్వ భక్షకాలు. అంటే గింజలనూ, దుంపలను తిని శాఖాహారులుగానూ, కీటకాలను తిని మాంసాహారులు గానూ ఉంటాయి. అంతే కాదు ఇవి పాములను మహా ఇష్టంగా తింటాయి. నెమలి గుడ్లను పెడుతుంది. ఈ గుడ్లు తెలుపు రంగులోగానీ పాల కాఫీ రంగులో కానీ వుంటాయి.



పొడుపు కథలు



1. అద్దెడు చెట్టు కింద గిద్దెడు రూకలు
2. అణా డబ్బుల్లో ప్రపంచం నీ అరచేతిలో
3. దేహం వేలెడు, తోక బారెడు
4. అనగనగా అడవి. అడవిలో సింహాలు. వేటాడితే చిటా పటా అరుస్తాయి
5. అనగనగా గచ్చు మేడ, గచ్చు మీద చెక్క మేడ, చెక్క మేడ ముందు కంచు మేడ, కంచు మేడలో ముత్యాలు, ముత్యాల మధ్య ఐదుగురి నాట్యం.

జవాబు: 1 వేరు శనగ చెట్టు 2.వార్తా పత్రిక, 3. సూది, దారం, 4 పేలు, 5.నేల, పీట, పళ్లెం, అన్నం, చేతి వేళ్లు.



దాగున్నదేంటో?

హాలో...ఇక్కడున్న చుక్కల్లో ఏం దాగుందో తెలుసా? అదేంటో తెలియాలంటే 1 నుంచి 54 వరకు ఉన్న చుక్కల్ని వరుసగా కలిపేయండి.



పులులెన్ని?

హాయ్... కింద మీకు ఎన్ని పులులు కనిపిస్తున్నాయి. ఎన్నేంటి నాలుగు పులి తలలు కనిపిస్తున్నాయి అంటున్నారా? అయితే మీరు తప్పులో కాలేసినట్లే. కొంచెం పరీక్షగా చూడండి. ఆ నాలుగు పులుల తలల్లోనే ఇంకా కొన్ని పులి తలలున్నాయి. అవన్నీ లెక్కబెట్టి ఎన్నో చెప్పండే.

సాయం చేద్దామా

బుజ్జాయిలూ... ఇటువైపున్న యాంట్ ఈటర్ అటువైపున్న పుట్ట దగ్గరకు వెళ్లాలంట. కానీ వచ్చిన దారి మర్చిపోయింది. వెళ్లాలంటే దారి తెలియక ఎవరైనా సాయం చేస్తారేమోనని ఎదురుచూస్తోంది. చేస్తారా మరి.





నీటిమీద వలయాలు

(తరంగాలు)

నిలకడగా ఉన్న నీటిలోకి ఏదైనా రాయి విసిరినప్పుడు ఏర్పడే తరంగాలు గుండ్రంగా ఉంటాయి. మరి ప్రవహించే నీటిలో రాయి విసిరినప్పుడు ఏర్పడే వలయాలు (తరంగాలు) వృత్తాకారంలో ఉంటాయా? లేదా దీర్ఘవృత్తాకారంలో వుంటాయా?

జవాబు: నీరు నిలకడగా వున్నా, ప్రవహిస్తున్నా అందులో రాయి విసిరినప్పుడు ఎర్పడే తరంగాలు ఒకేలా అంటే వృత్తాకారంలో వుంటాయి. నీటిలో తరంగ కణాల చలనం రెండు రకాలుగా ఉంటుంది. ఒకటి కేంద్రం నుండి వృత్తాకారంగా దూరంగా (వెడల్పుగా) జరుగుతుంది. రెండోది ప్రవాహంతో పాటు కదులుతూ స్థానభ్రంశం చెందుతుంది. ప్రవహించే నీటితో పాటు ఈ వలయాలు కూడా కదులుతూ ముందుకు వెళ్తాయి. అంతేకాని వలయాల ఆకారల్లో మార్పు వుండదు.

జెనా

మాటల కోట - 41

రూపకల్పన : కర్లపాలెం

1	2	3	■	■	■	4	5	6
7			■	■	8			
	■	9		10	■	■	11	
■	12	■	■	13	14	15	■	
■	16	17	18				19	■
20	■	21			■	■		■
22	23	■	■	24		25	■	26
27		28		■	■	29	30	
31			■	■	■	32		

అడ్డం :

1. దేశభాషలందు... లెస్స! (3)
4. జాతిపిత (3)
7. బాగుచేసేపేరు (3)
8. చెదిరిపోయిన గుంపు (4)
9. కృష్ణాజిల్లా చెరుకు ఊరు (3)
11. అటునుండి బాదు (2)
13. బహిరంగం (3)
16. తథదధనపఫ............ (7)
21. మంత్రించి కడితే రోగం మాయమవుతుందా... అంతా యెత్తు! (3)
22. వెన్నెముక సగం విరిగిపోయింది (2)
24. తాటికళ్లు అటునుంచీ చూస్తున్నాయి (3)
27. మరీ అంత ఆవురావురా! ముందుది మింగేస్తావూ! (4)
29. పదహారు - ఒక మానిక పాతకాలం కొలమానంలో (3)
31. పాచికలు వేయడంలో ఒకటి ఎగిరి పోయె... మూడు చెదిరిపోయె! (3)
32. ఆకాశంలో ఆడవారి భాగం (3)

నిలువు :

1. ప్రాణానికి హాయి (3)
2. అటునుంచి పేలడం (2)
3. బోధించే వారు లఘువు కాదు (3)
4. జన్మ (2)
5. వెన్నుపూసలోని మూడు చెదిరిపోయాయి (3)
6. జీతము కాదు... మూత కాదు... కొండ... మబ్బు (4)
10. పారశీక భాష కవితా ప్రక్రియ. ఉమర్ ఖయ్యామ్ దీనికి ప్రసిద్ధం (5)
12. కేపిటల్‌లో సగం అరగబడితే పాఠశాలయిపోతుంది (2)
14. గొలుసు చివర తెగింది (2)
15. నుదురు మధ్యది చెరుపు... తిరగెయ్ (2)
17. భరతా... ముందూ వెనుకా చూసుకో... బాలయ్యా! (2)
18. ముందూ వెనుకా 'మాయెమాయే'! వెనకా ముందూ భయమాయే! (2)
19. ఇంగ్లీషు ఒకటి (2)
20. ప్రథమా విభక్తి (4)
23. పాకిస్తాన్ రాజధానే కాదు... మన హైదరాబాదు ప్రసిద్ధ బేకరి కూడా (3)
25. ముంగిలా ఉంటుందేగాని పాముకు బద్ధ విరోధి (3)
26. దౌర్జన్యం (3)
28. భలే మంచి చ-- బేరము (2)
30. పంచతంత్ర కథల్లో ఈపక్షి పేరు 'దూరదర్శి' (2)

మాటలకోట - 40జవాబు

1 జ	2 ము	న	■	3 ము	■	4 న	5 త	6 చే
7 గ	ద్ద	■	8 భ	గ్న	9 ము	■	9 వా	గు
డ	■	10 పా	ము	ని	చ్చె	11 న	■	వే
12 ము	13 చ్చ	ట	■	న	■	14 లు	15 ము	రా
■	16 అ	క	ప్ప	■	17 ఎ	గు	త్త	■
18 లు	ట	చే	■	19 ప	■	20 రి	వి	21 వి
ము	■	22 రి	23 కా	య	24 పా	లో	■	లా
25 తీ	త	■	26 ఆ	ర	వ	■	27 ని	స
28 ర	త్	కా	■	కా	■	29 ఎ	క్క	ము

సృష్టిలో విలువైనది

మధువర్మ తన నలుగురు కుమారుల్ని పిలిచి "ఈ రాజ్యానికి నా తర్వాత ఒక్కరే రాజు కాగలరు. ఆ ఒక్కరు ఎవరన్నది మీ తెలివి తేటల మీద ఆధారపడి వుంది. కావలసినంత ధనం తీసుకెళ్లండి. మీకు ఆరు నెలలు గడువిస్తున్నాను. ఈ సృష్టిలో విలువైనది ఏంటో తెలుసుకుని తీసుకొచ్చి నాకు చూపించండి" అన్నాడు.

నలుగురు రాజకుమారులు ఖర్చులకు డబ్బు తీసుకుని, గుర్రాలు వేసుకుని తలో దిక్కు బయలుదేరారు.

గంధసిరి నగరంలోకి వెళ్లిన పెద్దవాడు, రాజ దుస్తులతో గుర్రంపై నుండి పరిసరాలని గమనిస్తూ వెళ్తున్నాడు. అతడ్ని తన మేడమీద నుండి చూసిన రంగసాని, తన పరిచారికతో దగ్గరకు పిలిపించుకుంది. తగు మర్యాదలు చేసి, అతని వివరాలు అడిగింది.

తన తండ్రి చెప్పిన విషయం చెప్పి "సృష్టిలో అన్నింటికంటే విలువైన దానికోసం వెదుకుతున్నాను" అన్నాడు.

"అయ్యో, మహారాజా నన్ను ఎదురుగా వుంచుకుని ఇంకా ఆలోచిస్తున్నారా? ఈ సృష్టిలో స్త్రీ కంటే విలువైంది మరోటి లేదు. అందుకే ఈ నగరంలోని ధనవంతులు, గొప్పవాళ్లంతా నా కోసం వస్తుంటారు. సామాన్యులు నావైపు కన్నెత్తి చూడడానికి కూడా సాహసించరు. నన్ను వెంట తీసుకుని వెళ్తే మీ నాన్నగారు తప్పకుండా మిమ్మల్నే మహారాజును చేస్తారు. ఎందుకంటే నా అంత అందమైన స్త్రీ, ఈ చుట్టుపక్కల పన్నెండు రాజ్యాల్లో ఎక్కడా లేదు" అంది.

ఆమె మాటలు నిజమనిపించాయి. అక్కడే వుండిపోయాడు. రెండోవాడు వెళ్లి పూటకూళ్ల పెద్దమ్మ ఇంట్లో విడిది చేశాడు. అక్కడ కొంతమంది వర్తకులు కలిశారు. పరస్పర పరిచయాలయ్యాక, వారితో తన అన్వేషణ గురించి చెప్పాడు.

"ఈ లోకంలో వజ్రాలకంటే విలువైంది మరోటి లేదు. అత్యంత విలువైన వజ్రం నా దగ్గరుంది. పదివేల వరహాలకు అమ్ముదామనుకుంటున్నాను" అన్నాడు ముఖంపై మచ్చలున్న వర్తకుడు.

"ఆ వజ్రం నాకివ్వండి. మీకా పదివేల వరహాలిస్తాను" అని తన నడుముకున్న వరహాల మూట తీశాడు.

వర్తకుడు సంతోషంగా రాకుమారుడిచ్చిన వరహాలు తీసుకుని వజ్రాన్ని ఇచ్చి వెళ్లాడు.

మూడో రాకుమారుడు వెలుగు సిరి నగరంలో పర్యటిస్తున్నాడు. ఒక మైదానంలో యుద్ధవిద్యల పోటీలు జరుగుతున్నాయి. గెలిచిన యోధుడ్ని ప్రజలు తమ భుజాలపై మోస్తూ జేజేలు పలుకుతున్నారు. అతనికి శిక్షణనిచ్చిన గురువు గర్వంగా ఆ దృశ్యాన్ని చూస్తున్నాడు..

రాకుమారుడు ఆ గురువు వద్దకు వెళ్లి "సృష్టిలో విలువైనది యుద్ధ విద్యలేనా?" అడిగాడు.

"సందేహమేముంది? శౌర్య, పరాక్రమాలతో యుద్ధ విద్యల్ని ఔపోసన పట్టిన వీరుడ్ని ప్రజలెంతో ఆరాధిస్తారు. చివరకు శత్రురాజులైనా సరే, వీరుణ్ణే గౌరవిస్తారు" అన్నాడు.

"మీరు కోరినంత ధనమిస్తాను. దయచేసి, నన్ను మీ శిష్యుడిగా చేర్చుకోండి. నాకా యుద్ధ విద్యలు నేర్పండి. ఆరు నెలల గడువు మాత్రమే వుంది" అన్నాడు.

గురువు అందుకు అంగీకరించాడు.

నాలుగవ రాకుమారుడు గుర్రం మీద వెళ్తుంటే గురుకులంలో విద్యాభ్యాసం ముగించుకుని, నడిచివెళ్తున్న బ్రాహ్మణ యువకుడు కనిపించాడు. గుర్రం ఆపి అతన్ని ఎక్కించుకున్నాడు. పరస్పర సంభాషణలతో ఒకరినొకరు పరిచయం చేసుకున్నారు. తన పర్యటన గురించి చెపుతూ "సృష్టిలో విలువైనదాన్ని వెతుకుతున్నాను" అన్నాడు.

"మా గురువుగారైతే అనుభవం గొప్పదని చెప్పారు. గురువు చెప్పారనో, పెద్దలు రాసి పెట్టారనో నమ్మడం కాదు. తను స్వయంగా శోధించి తెలుసుకోవడం మంచిదని కూడా చెప్పారు. కాబట్టి మనం రాజ్యంలో పర్యటించి అంతకన్నా విలువైనది ఉందేమో తెలుసుకోవడం చాలా మంచిది" అన్నాడు.

"సరే, ఇద్దరం కలిసే తిరుగుదాం" అనుకున్నారు. వెంటనే తమ దుస్తుల్ని మార్చుకుని సాధారణ పౌరులుగా మారిపోయారు. సంతలు, సానివాడలు, వ్యవసాయ క్షేత్రాలు, జూదశాలలు, కర్మాగారాలు, నదీతీరాలు... ఇలా ఎన్నో ప్రదేశాల్లో తిరిగారు. రకరకాల మనుషుల్ని, వాళ్ల ప్రవృత్తుల్ని తెలుసుకున్నారు. తమకు కలిగిన అనుభవాల్ని, సందేహాల్ని పరస్పరం చర్చించుకుంటూ పరిష్కరించుకోసాగారు. ఆర్నెల్ల పాటు విస్తృతంగా పర్యటించి విశేష అనుభవం కూడగట్టుకున్నారు.

రాజు పెట్టిన గడువు పూర్తికాగానే నలుగురు రాకుమారులు తమ రాజ్యం చేరుకున్నారు.

మొదటి రాకుమారుడు తను వెంట బెట్టుకుని వచ్చిన రంగసానిని చూపిస్తూ "ఈమె కోసం ధనవంతులెందరో పోటీ పడుతుంటారు. ఈమె చాలా విలువైనది. ఇంతటి అందగత్తె మరొకరు లేరు. ఈ సృష్టిలో ఈమె చాలా విలువైనది" అన్నాడు.

"పరులు ఎంగిలి చేసిన పండును తినేవాడివి. నువ్వు రాజుగా పనికిరావు. పక్కనుండు" అన్నాడు మహారాజు.

తర్వాత రెండో రాకుమారుడు తన దుస్తులలో దాచిన వజ్రాన్ని చూపించి "దీనికంటే విలువైనది మరొకటి లేదు" అన్నాడు.

రాజు తన మందిరంలోంచి మరొక వజ్రం తెప్పించాడు. అది రాకుమారుడు తెచ్చిన వజ్రం కంటే పెద్దదిగానూ, అందంగానూ కనిపించింది. "నీకు అమ్మిన వర్తకుడే నాకూ అమ్మాడు. ఇంతకంటే విలువైనది లేదని. కానీ కాలం గడుస్తున్న కొద్దీ ఇలాంటివి దొరుకుతూనే వుంటాయి" అన్నాడు రాజు.

రెండోవాడు తల వంచుకుని పక్కన నిలుచున్నాడు.

మూడోవాడు ముందుకొచ్చి "యుద్ధ విద్యలు వచ్చినవాడే విలువైన వాడని తెలుసుకున్నాను. ఆరునెలలపాటు కఠిన శ్రమచేసి ఎన్నో విద్యలు నేర్చుకున్నాను" అన్నాడు తన కండలు తిరిగిన దేహంతో నిలుచుని.

"ఇవాళ ఇద్దరు వర్తకులు నా వద్దకు వచ్చి ఒక మేలుజాతి గుర్రం తనదంటే తనదని వాదులాడుకుంటున్నారు. నువ్వు నేర్చిన విద్యతో ఆ గుర్రం వారిద్దరిలో ఎవరిదో చెప్పగలవా?" అన్నాడు.

"గుర్రంపై స్వారీ చేయడమే గానీ, ఇటువంటి చిక్కుప్రశ్నలు విప్పడం నాకు రాదు" అని వినయంగా సమాధానం చెప్పాడు.

"నువ్వు అలా పక్కన వుండు. నాలుగోవాణ్ణి చూద్దాం" అన్నాడు.

నాలుగోవాడు ముందుకొచ్చి "రాజ్యమంతా పర్యటించి విలువైన అనుభవాన్ని సంపాదించాను. అనుభవం కంటే కూడా విలువైన స్నేహితుణ్ణి పొందాను" అన్నాడు.

"ఏదీ నీ అనుభవంతో, స్నేహితుని సహాయంతో ఈ గుర్రం తగాదాను పరిష్కరించు" అన్నాడు.

తన స్నేహితుడి వైపు చూడగా తనేదో సైగ చేశాడు. వెంటనే రాకుమారుడు "ఈ గుర్రం నాదంటే నాదని తగాదా పడుతున్నారు కదా. దాని తోకలోని ఒక వెంట్రుక పీకి ఇవ్వండి. గుర్రం ఎవరిదో చెపుతాను" అన్నాడు.

మొదట పొడవుగా ఎర్రగా వున్న వర్తకుడు గుర్రంవైపు వెళ్లాడు. అతడిని చూస్తూనే సకిలిస్తూ బెదరసాగింది. చాలా ప్రయత్నం మీద వెనక్కు వెళ్లి తోక మీద చెయ్యి వేయబోయాడు. అంతే ఫెడేల్మని కాలితో మూతిమీద తన్నింది. పళ్లు రాలి నోరంతా రక్తసిక్తమైంది. దాని తోకను కూడా తాకలేకపోయాడు.

తరువాత నల్లగా, బక్క పలచగా వున్న వర్తకుడు గుర్రం ముందుకు వెళ్లాడు. అతణ్ణి చూస్తూనే పిల్లిలా మారిపోయి అరమోడ్పు కండ్లతో తలను అతనికేసి రుద్దుకోసాగింది. దానిమెడను కొద్దిసేపు నిమిరి పక్కగా వెళ్లి దాని తోకలోని వెంట్రుకను లాగాడు. దాన్ని భద్రంగా తెచ్చి రాజు ముందు పెట్టాడు.

"శభాష్. గుర్రం నీదే. తీసుకుని వెళ్లు. ఈ దొంగవెధవకు గుర్రమే తగిన శిక్ష విధించింది. ఇక మీరు వెళ్లండి" అన్నాడు.

ఉత్తమ స్నేహితుణ్ణి, చక్కటి అనుభవాన్ని స్వంతం చేసుకున్న నా నాలుగో పుత్రుణ్ణే రాజుగా ప్రకటిస్తున్నాను. అతనికి సహాయంగా మూడో కుమారుణ్ణి సైన్యాధ్యక్షుడిగా నియమిస్తున్నాను. రెండో వాడిని కోశాధికారిగా ఏర్పాటు చేస్తున్నాను. ఇంక మొదటి వాడికి జీవితం విలువ తెలియజెప్పడానికి రెండేళ్లపాటు పల్లెలో వ్యవసాయం చేయవలసిందిగా ఆజ్ఞాపిస్తున్నాను" అన్నాడు మధువర్మ

మరుసటి రోజే నాలుగవ రాకుమారుడికి పట్టాభిషేకం జరిగింది. తనకు మంచి మిత్రుడైన బ్రాహ్మణ యువకుణ్ణి మంత్రిగా నియమించుకుని ఎన్నో ఏళ్లు చక్కగా రాజ్యపాలన చేశాడు.

\- పుప్పాల కృష్ణమూర్తి

నడిచే అయస్కాంతాలు...

మిత్రులు ఎవరైనా ముక్కు మీద స్పూను నిలబెట్టి చూపించారనుకోండి. తెగ ఆశ్చర్యపోతాం. తల ఊపినా స్పూను కిందపడలేదనుకోండి హతాశులమౌతాం. వారిలో వున్న ప్రత్యేకతను మెచ్చుకుంటాం. అలాంటిది తమలో వున్న అయస్కాంత శక్తితో వంటిమీద రకరకాల వస్తువులను నిలబెట్టగలిగితే!? ఇలాంటి శక్తి వున్న వారికి ఏకంగా ఒక పోటీ నిర్వహిస్తే?! ఆశ్చర్యానందాలలో మునిగితేలిపోమూ! అదే వియత్నాంలో జరిగింది. చూడండి మొహం మీద... పొట్ట మీద... స్పూన్లు, ఫోర్కులు, ఇనుప ముక్కలు నిలబెట్టి ఎలా ఫోజిచ్చారో? కాకపోతే వీరందరిలోకి తా క్వాంగ్ తాన్ అనే వ్యక్తి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. కారణం ఈయన ఏకంగా 42 కిలోల రాయిని పొట్టమీద నిలబెట్టేశాడు. అది చూచిన ప్రేక్షకులే కాదు... న్యాయనిర్ణేతలు సైతం ముక్కున వేలేసుకున్నారట. అలా ఆ దేశంలో అప్పటివరకు వున్న రికార్డులనే తిరగరాసిన వ్యక్తిగా క్వాంగ్ మీడియాకెక్కేశాడు.